

నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ఏడాది పాటు మీరు చేసిన శ్రమకు ఇది పరీక్ష సమయం. ఎలాంటి భయాలు, ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయండి. మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులకు గర్వకారణం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 16.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 328 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00





## వాట్సాప్ గవర్నెన్స్‌కు టెన్త్ విద్యార్థుల అపూర్వ ఆదరణ

**హాయ్ అనగానే విద్యార్థుల చేతలో వాలిన హాల్ టికెట్లు**

**హాల్ టికెట్ల కోసం 3.16 లక్షల హిట్లు**

**2.38 లక్షల మందికి వాట్సాప్ ద్వారా హాల్ టికెట్లు**

2

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను పదో తరగతి విద్యార్థులు గణనీయంగా వినియోగించుకుని తమ హాల్ టికెట్లను లక్షల సంఖ్యలో దీని ద్వారా పొందారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ప్రభుత్వం పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 నెంబరు ద్వారా పొందే సదుపాయం కల్పించింది. ఈ సదుపాయాన్ని పదో తరగతి విద్యార్థులు పెద్ద ఎత్తున వినియోగించకుని హాల్ టికెట్లు పొందారు.



## ప్రధాని మోదీ చర్చలు సఫలం...

# రెండు భారత నౌకలకు 'దారి'

- 92 వేల టన్నుల వంటగ్యాస్‌తో నేడో రేపో ఇండియాకు

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ జరిపిన చర్చలు సత్ఫలితాలిచ్చాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి వద్ద చిక్కుకుపోయిన రెండు భారతీయ ఎల్‌పీజీ నౌకలు శివాలిక్, నందాదేవి శనివారం ఉదయం 9.30 గంటలకు భారత నౌకాదళం రక్షణలో సురక్షితంగా అంతర్జాతీయ సముద్ర జలాల్లోకి ప్రవేశించాయి. శివాలిక్ 40 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో కాండ్లా రేవు(గుజరాత్)కు వస్తుండగా.. నందాదేవి 52 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో ముంబై రేవుకు తీసుకొస్తోంది. ఒకట్రెండు రోజుల్లో అవి చేరుకుంటాయని భారత షిప్పింగ్ కార్పొరేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. ప్రస్తుతం హోర్ముజ్‌లో ఇంకా 22 భారత నౌకలు ఉన్నాయి.. వీటిలో 6 ఎల్‌పీజీవి, ఒకటి సీఎన్‌జీ, 4 క్రూడాయిల్ నౌకలు. మిగతా 2లో...

## ● మోగిన ఎన్నికల నగారా

- నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల




**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలోని నాలుగు రాష్ట్రాలు మరియు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌నుభారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రాష్ట్రాలు, ప్రాంతాల్లో కలిపి మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో పాటు వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి మిగతా 2లో...

## ఓటర్ల జాబితా సవరణపై

# అనవసర రాద్ధాంతం



- ఎస్ఐఆర్‌తో ఓటర్ల జాబితాలో పారదర్శకత
- చొరబాటుదారులకు ఓటు హక్కు కాంగ్రెస్ హయాంలోనే
- చొరబాటుదారుల తొలగింపుపై కాంగ్రెస్‌కు ఎందుకు ఆందోళన?
- ఓటర్ల జాబితా పారదర్శకత కోసం ఎస్ఐఆర్ అవసరం
- ఆంధ్రప్రదేశ్ బీజేపీ

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఓటర్ల జాబితా సవరణలో భాగంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై విపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విమర్శించారు. చొరబాటు దారులకు ఓటు హక్కు కల్పించినది కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని ఆయన ఆరోపించారు. మిగతా 2లో...

## సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026 సిద్ధం!



- 'అవేర్ ద్వారా 4-5 రోజుల ముందుగానే సదరు ప్రాంతాల్లో వేసవి తీవ్రతపై అప్రమత్తం
- జిల్లా అధికారులు, వైద్యులకు శిక్షణ కార్యక్రమాలు
- కేసుల నమోదుకు అనుగుణంగా సత్వర చర్యలు
- 1 71 కోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం!
- చికిత్స అందించేందుకు ఉప ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్సీల స్థాయి నుంచి సన్నద్ధత
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వేసవి తీవ్రత అంచనాలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఆధారంగా రూపొందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026'పై ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ చర్చించారు. వేసవి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తశీ చేయడం, వడ దెబ్బకు గురైతే సదరు లక్షణాలను వెన్వెంటనే గుర్తించి సకాలంలో వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించడం, ఇలాంటి కేసుల్లో చికిత్స ఎలా అందించాలన్న దానిపై వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండడం, మిగతా 2లో...



# మైనారిటీల ఆత్మీయ నేస్తం తెలుగుదేశం

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటేతీరుగా ముస్లీమ్ సోదరులు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాలకు అంతే ప్రాధాన్యత ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముస్లీమ్ సోదరులకు పార్టీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక బుర్రిపాలెం రోడ్ లోని, శతాధిక వత్సరాల చరిత్రగల జామియా మశీద్ ప్రాంగణంలో, ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు షేక్ నశీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఉపవాస దీక్షలో ఉన్న ముస్లీమ్ సోదరులకు పంపిణీ చేశారు. మిగతా 2లో...

## మత సామరస్యానికి వేదికగా బీజేపీ ఇఫ్తార్ విందు



- త్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళలకు న్యాయం
- మైనారిటీ సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది
- ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేసిన బీజేపీ నేతలు

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ సయ్యద్ బాషా ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం ముస్లిం మైనారిటీ సోదరుల కోసం ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ప్రపంచంలో వివిధ జాతులు, మతాలకు ఆశ్రయం ఇచ్చిన దేశం భారతదేశమని అన్నారు. పవిత్ర ఖురాన్ ప్రపంచానికి అందించిన సందేశం శాంతి, సహనమని పేర్కొన్నారు. విద్వేషాల నేపథ్యంలో అన్ని మతాల సారాంశాన్ని సమాజానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరి దేవుడు వారికి పవిత్రమని, మతాల పేరుతో దాడులు చేయడం సరైనది కాదని తెలిపారు. బీజేపీ ఎవరికి వ్యతిరేకంగా పనిచేయదని, ముస్లిం సమాజంపై పార్టీకి ఎలాంటి ద్వేషం లేదని స్పష్టం చేశారు. చెదురుమదురు సంఘటనలను పెద్దగా చూపించి అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. హిందూత్వం ఒక మతం కాదని, అది జీవన విధానమని తెలిపారు. మిగతా 2లో...

## అమరావతిలో పొట్టి శ్రీరాములు భారీ విగ్రహం

- 58 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు
- నేడు పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం
- విజయవాడలో ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందులో పాల్గొననున్న సీఎం
- నేడు అమరావతి, విజయవాడలో పర్యటించనున్న ముఖ్యమంత్రి




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం అమరావతి, విజయవాడలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక అయిన అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ విగ్రహావిష్కరణ, మరోవైపు రంజాన్ పవిత్రతను చాటుతూ ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున ఇచ్చే ఇఫ్తార్ విందులో సీఎం పాల్గొననున్నారు. ఉదయం 11:15 గంటలకు అమరావతిలో శాఖమూరు పార్కు వద్ద ఏర్పాటు చేసిన 58 అడుగుల మిగతా 2లో...

# బీసీలకు 'రక్షణ'తో భరోసా

- త్వరలోనే బీసీ రక్షణ చట్టం అమల్లోకి...
- వెనుకబడిన వర్గాల ధన, మాన, ప్రాణ రక్షణకు ప్రాధాన్యం
- బీసీల గౌరవప్రద జీవనం కూటమి సంకల్పం : మంత్రి సవిత
- బీసీల రక్షణమే కూటమి లక్ష్యం : మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర
- విజయవాడలో బీసీ రక్షణంపై బీసీల మంత్రుల భేటీ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన మంత్రులు వాసం శెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, సత్య కుమార్ యాదవ్

2లో

# గ్యాస్‌పై ప్రజలు ఆందోళన చెందొద్దు

- కొరత సమస్య లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు
- మంత్రుల బృందం, ప్రత్యేక అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణ
- కష్టం, నష్టాన్ని తగ్గించేందుకు ముమ్మర ప్రయత్నాలు
- సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ, బలోపేతానికి కృషి
- వంట గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు
- ఆసుపత్రులు, హాస్టళ్ల కార్యకలాపాలకూ ప్రాధాన్యం
- బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, మంత్రుల బృందం (జీవోఎం) నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు.

శనివారం కానూరులోని పౌర సరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వర్చువల్‌గా నాదెండ్ల మనోహర్.. పౌర సరఫరాలు, సమాచార, పౌర సంబంధాలు, పోలీస్, విజిలెన్స్ తదితర సమన్వయ శాఖల అధికారులతో పాటు ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌పీజీ రోజువారీ అవసరాలు, సరఫరా స్థితిగతులతో పాటు మిగతా 2లో...

## థ్యాంక్యూ...లోకేష్... మనమిత్ర



(మొదటి పేజీ తరువాయి)

మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌కు పదో తరగతి విద్యార్థుల నుంచి మొత్తం 3,16,990 హిట్‌లు వచ్చాయి. అలాగే 2,38,728 మంది విద్యార్థులు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తమ హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకున్నారు. విద్యాశాఖ లీప్ యాప్ ద్వారా 65,477 మంది హాల్ టికెట్లు డౌన్లోడు చేసుకోగా, అత్యధికంగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా 7,53,834 మంది హాల్ టికెట్లు పొందారు.

**విద్యార్థుల్లో పెరిగిన డిజటల్ స్పృహ:** పదో తగరతి పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల్లో డిజిటల్ స్పృహ పెరిగింది. గతానికంటే భిన్నంగా ఈ సారి విద్యార్థులు లక్షల సంఖ్యలో తమ హాల్ టికెట్లను డిజిటల్ రూపంలో ఆన్‌లైన్, మనమిత్ర, లీప్ యాప్‌ల ద్వారా పొందారు. గతంలో ఎక్కువ మంది నేరుగా పాఠశాలకు వెళ్లి ఫిజికల్‌గా హాల్ టికెట్లు పొందేవారు. ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.

## ప్రధాని మోదీ చర్చలు సఫలం ... రెండు భారత నౌకలకు 'దారి'

(మొదటి పేజీ తరువాయి)

వీటికి కూడా ఇరాన్ దారి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వీటికి ముందు శుక్రవారం ఒక ఎల్‌పీజీ నౌక ముంబై రేవుకు చేరుకున్న సంగతి తెలిసిందే. అలాగే భారతీయ పతాకం కలిగిన జగ్‌ప్రకాశ్ అనే నౌక కూడా ఒమాన్ గుండా ఆఫ్రికా బయల్దేరింది.

## మోగిన ఎన్నికల నగారా




(మొదటి పేజీ తరువాయి)

వచ్చినట్లు అధికారులు తెలిపారు.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏకదశలో జరగనున్నాయి. మొత్తం 234 నియోజకవర్గాలకు గాను గెజిట్ నోటిఫికేషన్ మార్చి 30న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలు చివరి తేదీ ఏప్రిల్ 6 కాగా, ఏప్రిల్ 7న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 9 వరకు గడువు ఉంటుంది. పోలింగ్ ఏప్రిల్ 23న నిర్వహించనుండగా, ఓట్ల లెక్కింపు మే 4న చేపడతారు. ఎన్నికల ప్రక్రియ మే 6న ముగియనుంది.

పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. మొదటి దశలో 152 నియోజకవర్గాలకు మార్చి 30న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి, ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నారు. రెండో దశలో 142 నియోజకవర్గాలకు ఏప్రిల్ 2న నోటిఫికేషన్ జారీ చేసి, ఏప్రిల్ 29న పోలింగ్ నిర్వహిస్తారు. ఈ రాష్ట్రంలో కూడా ఓట్ల లెక్కింపు మే 4న జరగనుండగా, ఎన్నికల ప్రక్రియ మే 6న పూర్తవుతుంది.

కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో జరగనున్నాయి. ఈ ప్రాంతాలకు మార్చి 16న గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలు చివరి తేదీ మార్చి 23 కాగా, మార్చి 24న పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 26 వరకు గడువు ఉంటుంది. పోలింగ్ ఏప్రిల్ 9న నిర్వహించనుండగా, ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియ మే 6న పూర్తికానుంది.

## అమరావతిలో పొట్టి శ్రీరాములు భారీ విగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. అమరజీవి త్యాగానికి స్ఫూర్తిగా ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని రూ. 150 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా 6.80 ఎకరాల స్థలంలో మొదటి దశ పనులు పూర్తి అయ్యాయి. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం 6 నెలల్లోనే రికార్డు స్థాయిలో పనులు చేపట్టి 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్‌ను ఉపయోగించారు. రెండో దశలో ఇక్కడ మ్యూజియం, ఫోటో గ్యాలరీ, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మించనున్నారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు పోరాడిన శ్రీరాములు త్యాగాన్ని చాటిచెప్పేలా ఈ స్మృతివనాన్ని తీర్చిదిద్దనున్నారు. సాయంత్రం 05:40 గంటలకు విజయవాడ చేరుకుని ముస్లిం సోదరుల గౌరవార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మైనారిటీలకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారితో కలిసి ఆయన ఇఫ్తార్ విందు స్వీకరిస్తారు.

## ఆరోపణలను నమ్మొద్దు..



- ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ వివరణ

**ఏలూరు(జర్నలిస్ట్ ఫైల్):** మొయినాబాద్ డ్రగ్స్ ఘటనలో తనపై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ వివరణ ఇచ్చారు. తాను ఎలాంటి వ్యక్తినో ఏలూరు ప్రజలు, పార్టీ నేతలకు తెలుసన్నారు. తనకు ఎలాంటి దురలవాట్లు లేవని, ఏ తప్పూ చేయలేదని తెలిపారు. " స్నేహితుడు పిలిస్తే కలవడానికి మాత్రమే మొయినాబాద్ ఫామ్‌హౌస్‌కు వెళ్లా. ఆ సమయంలో మీడియాలో రకరకాల కథనాలు వచ్చాయి. ఆరోపణలను ఎవరూ నమ్మొద్దు. పోలీసు విచారణకు సహకరిస్తా. పూర్తి వివరాలతో త్వరలో ప్రజలకు ముందుకు వస్తా" అని పుట్టా మహేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

## మైనారిటీల ఆత్మీయ నేస్తం తెలుగుదేశం





**(మొదటి పేజీ తరువాయి)** అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మీడియాతొ మాట్లాడుతు తెనాలి ప్రాంతంలో హిందూ ముస్లీమ్ సంఘీయుల మధ్య, శతాబ్ద కాలంగా సోదర సమాన భావం కొనసాగుతుందన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ఇదో నిదర్శనమన్నారు. ముస్లీములకు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అందరికి అల్లా ఆశీస్సులు మెండుగా లభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్ రెహమాన్, ఎమ్డీ జాకీర్, షేక్ తాజ్ బాష, షేక్ ఫరీద్, మహ్మద్ కుద్దూస్ తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## బీసీలకు 'రక్షణ'తో భరోసా




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** 138 వెనుబడిన తరగతుల కులాల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించేలా బీసీ రక్షణ చట్టం రూపొందిస్తున్నామని, త్వరలోనే ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. బీసీలను కులం పేరుతో గాని, వృత్తి పేరుతో గాని దూషించినా, సాంఘిక బహిష్కరణలకు పాల్పడినా గాని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత నేతృత్వంలో శనివారం నిర్వహించిన బీసీ రక్షణ చట్టం భేటీలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ పాల్గొన్నారు. మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన అన్నీ హామీలను నెరవేరుస్తున్నామని, ఈ నేపథ్యంలో త్వరలోనే బీసీ రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నామని తెలిపారు. చట్టం రూప కల్పనకు తుది రూపు ఇవ్వడానికే బీసీ మంత్రులతో కీలక భేటీ నిర్వహించామన్నారు. ఇది వరకే రెండు పర్యాయాలు బీసీ మంత్రులు సమావేశమయ్యామన్నారు. ఇప్పటికే బీసీ చట్టం ముసాయిదా కూడా సిద్ధం చేశామన్నారు. 138 కులాలకు చెందిన బీసీలను కులం పేరుతోగాని, వృత్తి పేరుతో గాని దూషించినా, సాంఘిక, ఆర్థిక బహిష్కరణలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బీసీల ధన, మాన, ప్రాణాలకు భరోసా కల్పించేలా బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా రూపొందిస్తున్నామన్నారు. 15 రకాల వేధింపులకు శిక్షలు రూపొందిస్తున్నామన్నారు. బీసీ మంత్రుల భేటీ వివరాలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. దేశంనే తొలిసారిగా ఏపీలో బీసీ రక్షణ చట్టం అమలు చేయబోతున్నామన్నారు. బీసీ రక్షణ చట్టం డ్రాఫ్ట్ పై బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 జోన్లో ఉన్న బీసీ సంఘాలు, ప్రతినిధుల అభిప్రాయాలు కూడా తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. , త్వరలోనే బీసీ రక్షణ చట్టం అమలు చేయనున్నామని స్పష్టం చేశారు. బీసీలకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీసీలను అన్ని రంగాల్లో ముందు నిలపాలన్నదే కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు సంకల్పమని మంత్రి సవిత తెలిపారు.

**బీసీల రక్షణమే కూటమి లక్ష్యం : మంత్రులు అచ్చెన్న, కొల్లు రవీంద్ర :** అంతకుముందు నిర్వహించిన భేటీలో బీసీ చట్టం రూప కల్పనలో తీసుకున్న జాగ్రత్తలు, నిపుణులు సూచనలు గురించి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ వివరించారు. కేంద్ర అడ్వకేట్ జనరల్, జాతీయ బీసీ కమిషన్ సలహాలు సూచనలను కూడా ఏపీ బీసీ రక్షణ చట్టం రూపకల్పనలో పరిగణలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు కొల్లు రవీంద్ర, కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, బీసీ చట్టానికి తుదిరూపు ఇచ్చే క్రమంలో రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలతోనూ చర్చించాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా బీసీ రక్షణ చట్టం రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, సత్య కుమార్ యాదవ్, లా జా యింట్ సెక్రటరీ వెంకటేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు... వర్చువల్‌గా పాల్గొన్న లా జాయింట్ సెక్రటరీ.

## మత సామరస్యానికి వేదికగా బీజేపీ ఇఫ్తార్ విందు



(మొదటి పేజీ తరువాయి)

గతంలో కొన్ని రాజకీయ పార్టీలు ముస్లింలను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకున్నాయని విమర్శించారు. పేదల పేరుతో మాటలు చెప్పి, ప్రయోజనాలు మాత్రం ధనికులకు అందే విధంగా పాలన సాగిందని అన్నారు. అందువల్ల ఎస్సీ, ఎస్టీలు మరియు ముస్లింలు పేదరికంలోనే మిగిలిపోయారని వ్యాఖ్యానించారు. ముస్లిం సమాజంలో ఉన్న దురాచారంగా భావించిన ట్రిపుల్ తలాక్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసి మహిళలకు న్యాయం చేసిందని తెలిపారు. మైనారిటీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 5 వేల కోట్ల నిధులను కేటాయించిందని పేర్కొన్నారు.

మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ సయ్యద్ బాషా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సహనం, దాతృత్వం మరియు సోదరభావానికి ప్రతీక అని తెలిపారు. ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు నిర్వహించడం పరస్పర సౌహార్దానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. అన్ని మతాల మధ్య ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించడం సమాజానికి అవసరమని పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీ సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి మైనార్టీ మోర్చా కృషి చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మోర్చా రాష్ట్ర ఇంచార్జ్ పి. వేణుగోపాలం, మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షర్మిలా ఖాతున్, ఎస్‌డీ కరీముల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైరోజ్ ఖాన్, రాష్ట్ర కార్యదర్శులు డా. మస్తాన్, షకీలా, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. రమేష్ నాయుడు, సన్న దయాకర్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, సీనియర్ నాయకులు మెహబూబ్, డి. హుస్సేన్, మాజీ వక్ఫ్ బోర్డు సభ్యుడు డి. మీరా వలి, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ రహీం ఇబ్రహీం, షేక్ రఫీ, గౌస్ పీరా, షేక్ మస్తాన్, షేక్ అన్వర్, సయ్యద్ ఇంతియాజ్, పి. ఖయ్యాం ఖాన్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టీఐ చట్టం ప్రజాస్వామ్యానికి బ్రహ్మాస్త్రం




- రాష్ట్ర సమాచార కమిషనర్ పీ. సింహాచలం నాయుడు వెల్లడి
- గుడ్ గవర్నెన్స్ లో కమిషనర్ వెల్లడి
- పౌరుల రైట్ టు నో భావనకు పునాది
- హమారా పైసా, హమారా హిసాబ్ అంశంపై పోరాటం
- దేశవ్యాప్తంగా అన్ని వ్యవస్థల పారదర్శకతకు దోహదం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరిచే శక్తివంతమైన సాధనమని, ప్రజాస్వామ్యానికి ఇది బ్రహ్మాస్త్రం వంటిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పీ. సింహాచలం నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ లోని విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నిర్వహించిన "20 సంవత్సరాల ఆర్‌టీఐ , గుడ్ గవర్నెన్స్" అనే వర్క్‌షాప్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీ. సింహాచలం నాయుడు మాట్లాడుతూ 2005లో అమల్లోకి వచ్చిన ఆర్‌టీఐ చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాకుండా భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకతను తీసుకువచ్చిన కీలక సంస్కరణ అని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యకలాపాలపై సమాచారం పొందే హక్కును ఈ చట్టం కల్పించిందని చెప్పారు. దీని ద్వారా ప్రజలు ప్రభుత్వ పనితీరును పర్యవేక్షించే అవకాశం లభించిందన్నారు.

సమాచార హక్కు భావనకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న చరిత్రను ఆయన వివరించారు. స్వీడన్‌లో 1766లో సమాచార స్వేచ్ఛ చట్టం అమల్లోకి రావడంతో ప్రపంచంలో పౌరుల "రైట్ టు నో" అనే భావనకు పునాది పడిందని తెలిపారు. తరువాత అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాలు కూడా సమాచార హక్కుకు సంబంధించిన చట్టాలను అమలు చేసి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేశాయని చెప్పారు.

భారతదేశంలో ఆర్‌టీఐ చట్టం ప్రజల దీర్ఘకాల పోరాట ఫలితంగా అమల్లోకి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ముఖ్యంగా రాజస్థాన్‌లోని బేవర్ ప్రాంతంలో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకేఎస్‌ఎస్) వంటి ప్రజా ఉద్యమాలు "హమారా పైసా – హమారా హిసాబ్" అనే నినాదంతో సమాచార హక్కు కోసం పోరాడినట్లు వివరించారు. ఆ ఉద్యమాల ప్రభావంతోనే ఆర్‌టీఐ చట్టం రూపుదిద్దుకుందని తెలిపారు.

ఆర్‌టీఐ చట్టం మంచి పరిపాలనకు (గుడ్ గవర్నెన్స్) నాలుగు ప్రధాన అంశాలను బలపరుస్తుందని ఆయన చెప్పారు. వాటిలో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వం––ప్రజల మధ్య భాగస్వామ్య నిర్ణయాలు, ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యతాయుత వ్యవహారం ముఖ్యమైనవని వివరించారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ విభాగాల్లో అవినీతిని తగ్గించి పారదర్శకతను పెంచే అవకాశం ఏర్పడిందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్‌టీఐ చట్టం అమలుతో అనేక కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. దూర ప్రాంత గ్రామాల నుంచి వచ్చిన సాధారణ పౌరుల దరఖాస్తులు కూడా ప్రభుత్వ యంత్రాంగాన్ని స్పందించేలా చేశాయని పేర్కొన్నారు. భూకుంభకోణాలు వెలుగులోకి రావడం, మధ్యాహ్న భోజన పథకం అమలు మెరుగుపడటం, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత పెరగడం వంటి అనేక ప్రయోజనాలు ఆర్‌టీఐ ద్వారా సాధ్యమయ్యాయని చెప్పారు.

డిజిటల్ యుగంలో ఆర్‌టీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆన్‌లైన్ ఆర్‌టీఐ పోర్టల్‌లు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా ప్రాంతీయ భాషల్లో కూడా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అలాగే యువతలో ఆర్‌టీఐపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాలో విమర్శలు చేయడం మాత్రమే కాకుండా ప్రజా సమస్యలపై స్పష్టమైన సమాచారాన్ని సేకరించి బాధ్యతాయుతంగా స్పందించాలన్నారు. విద్యార్థులు ఆర్‌టీఐ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీ హైకోర్టు అడ్వకేట్ పీ. మనోజ్ కుమార్ విద్యార్థులకు ఆర్‌టీఐ పిటీషన్ ఎలా దాఖలు చేయాలో వివరించారు.

అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీలోని విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లా డైరెక్టర్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది మరియు లా విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై అనవసర రాద్ధాంతం







(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలో నిర్వహించిన ఎస్ఐఆర్ రాష్ట్ర కార్యశాలలో ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే శ్రీకాంత్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభోపన్యాసం చేశారు. బీజేపీ రాష్ట్ర ఎస్ఐఆర్ కన్వీనర్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, శాసనమండలిలో బీజేపీ పక్షనేత సోము వీర్రాజు, శాసనసభలో బీజేపీ పక్షనేత పెన్మత్స విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ పోతుల సునీత, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, రాష్ట్ర సమన్వయకర్తలు జల్లి మధుసూదన్, శరణాల మాలతీరాణి, మేకల హనుమంతరావు తదితరులు వేదికను అలంకరించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రతి ఏడాది జరిగే నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపు వంటి చర్యలు ఇందులో భాగమని చెప్పారు. ఎస్ఐఆర్ అనేది బీజేపీ లేదా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన కార్యక్రమం కాదని, 2002 నుంచే అమలులో ఉందని పేర్కొన్నారు. ఈసారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా రూపొందుతోందన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యిందని, మరో 22 రాష్ట్రాల్లో ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఎంత కష్టపడతారో, అంతకంటే ఎక్కువగా వచ్చే 90 రోజులు బీఎల్ఏ-1లు కృషి చేయాలని సూచించారు.

ముఖ్య అతిథి ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే శ్రీకాంత్ శర్మ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియను వివరించారు. నిజమైన ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను నిర్వహిస్తోందని చెప్పారు. ఆయన ప్రసంగాన్ని ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి తెలుగులో అనువదించారు.

బీజేపీ రాష్ట్ర ఎస్ఐఆర్ కన్వీనర్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌పై పార్లమెంట్‌లో విస్తృతంగా చర్చ జరిగిందన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇచ్చారని తెలిపారు. ఈ ప్రక్రియ కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభమైందని, 24 సంవత్సరాల తర్వాత ఇప్పుడు మళ్లీ అమలు జరుగుతోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఓటర్ల జాబితాలోని అనర్హుల తొలగింపు జరుగుతుండటంతో కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేస్తున్నారని అన్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ వందన సమర్పణ చేస్తూ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రక్రియపై పార్టీని లక్ష్యంగా చేసుకుని విపక్షాలు విమర్శలు చేయడం అర్థరహితమని అన్నారు. చౌరబాటు దారులకు ఓటు హక్కు కల్పించడం ద్వారా కాంగ్రెస్ దేశ ప్రజలను అవమానించిందని ఆయన విమర్శించారు.

## ముదుమాల గుండపురం యువకుల మృతి కేసులో సంచలన మలుపు



- డీఎస్పీ, మందకృష్ణ మాదిగ సమక్షంలో సీన్ రీ-కన్స్ట్రక్షన్..
- ఇది పథకం ప్రకారం జరిగిన హత్యే: ఎమ్మార్పీఎస్

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ): ఫిబ్రవరి మాసంలో సంచలనం సృష్టించిన ముదుమాల గుండపురం దళిత యువకుల అనుమానాస్పద మృతి కేసులో ఒళ్లు గగుర్పొడిచే నిజాలు వెలుగు చూశాయి. సుమారు 40 రోజులుగా ఏమీ తెలియనట్లు నటించి సాక్ష్యాలను కప్పిపుచ్చిన మూడో వ్యక్తి సంతోష్ అసలు రంగు బయటపడింది. ఆదివారం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, మైదుకూరు అర్బన్ ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సీన్ రీ-కన్స్ట్రక్షన్'లో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి ఫిబ్రవరి 5న ఓబులేసు, ఫిబ్రవరి 6న సతీష్ మృతదేహాలు కాలువలో లభ్యమైనప్పుడు అందరూ దానిని ప్రమాదంగా భావించారు కానీ, ఘటన సమయంలో వారితో ఉన్న సంతోష్ తీరు ఇప్పుడు అనుమానాలకు బలం చేకూరుస్తోంది. సతీష్, ఓబులేసు కాలువలో పడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే, కాపాడాల్సిన సంతోష్.. తన సెల్‌ఫోన్‌లో వీడియోలు తీస్తూ ఉండిపోవడం గమనార్హం. అనంతరం ఏమీ తెలియనట్లు 40 రోజుల పాటు దైనందిన జీవితాన్ని గడపడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని బాధితుల కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు.

**ఇది జంట హత్యే - మందకృష్ణ మాదిగ ధ్వజం**

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడుతూ సంతోష్ తీరును తీవ్రంగా ఎండగట్టారు. "కళ్లముందే ప్రాణమిత్రులు చనిపోతుంటే వీడియోలు తీస్తూ, ఆ తర్వాత 40 రోజుల పాటు ఏమీ తెలియనట్లు మౌనంగా ఉండటం మనిషి చేసే పనేనా? ఇది భయం కాదు, ముమ్మాటికీ నేరాన్ని దాచే ప్రయత్నం. ఇది ఆత్మహత్య కాదు.. పక్కా పథకం ప్రకారం జరిగిన జంట హత్యలే" అని ఆయన గర్జించారు.
ఈ ఘోర కలికి వెనుక ఉన్న అదృశ్య శక్తులు ఎవరు? అసలు ఆ యువకులను కాలువలోకి నెట్టింది ఎవరు? అన్న కోణంలో పోలీసులు లోతైన విచారణ జరపాలని మందకృష్ణ డిమాండ్ చేశారు. కాలవగట్టు మీద జరిగిన ఈ మారణకాండను ఆత్మహత్యగా చిత్రీకరించాలని చూస్తే సహించేది లేదని, పోలీస్ వ్యవస్థ నిజా నిజాలను వెలికితీయకపోతే ఈ పోరాటం బ్రహ్మంగారిమఠం నుంచి రాష్ట్ర రాజధాని వరకు మారుమోగుతుందని హెచ్చరించారు.

**న్యాయం కోసం ఎదురుచూపు**

నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన సతీష్, ఓబులేసుల మరణానికి కారణమైన సూత్రధారులను పట్టుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు పోలీసు యంత్రాంగంపై ఉంది. సంతోష్ చెబుతున్న 'భయం' కట్టుకథలను పక్కన పెట్టి, శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పుంగనూరులో తీవ్ర విషాదం



పుంగనూరు (జర్నలిస్ట్ ఫైల్ ): అన్నమయ్య జిల్లా పుంగనూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బైక్ నుంచి వచ్చిన పొగ పీల్చి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. వారిలో తాత, మనవడు, ఇద్దరు మనవరాళ్లు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం... పుంగనూరు పట్టణంలోని త్యాగరాజు వీధిలో భజంత్రీ రామచంద్రప్ప (70), ఆయన కుమారుడు మురళీ, కోడలు రేవతి, వారి నలుగురు పిల్లలు నివాసముంటున్నారు. శనివారం మురళీ తన ద్విచక్ర వాహనానికి ఇంజన్ సమస్య ఉండడంతో పట్టణంలోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతులు చేయించారు. బైక్ ఇంజన్‌ను రాత్రంతా ఆన్‌చేసి ఉంచాలని బైక్ మెకానిక్ చెప్పారు. మురళీ బైక్‌ను ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు వేసి ఇంజన్ ఆన్ చేశారు. ఆ రోజు రాత్రి మురళీ తండ్రి రామచంద్రప్ప (70), కుమారుడు కార్తీక్ (13), కవలలు అయిన కుమార్తెలు చందన (6), చరిత (6) ఆ ఇంట్లోనూ, మురళీ, ఆయన భార్య ఇంటిమిద్దెపై గదిలోనూ నిద్రించారు. ఇల్లు ఇరుకుగా ఉండడం, గాలి బయటకు వెళ్లే వీలులేకపోవడంతో రాత్రంతా బైక్ నుంచి వెలువడిన పొగ గదిలో వ్యాపించింది. దీంతో, తాత, మనవడు, మనవరాళ్లు ఆ పొగ పీల్చి ఊపిరి ఆడక నిద్రలోనే మృతి చెందారు. ఇంటిపైన గదిలో నిద్రించడంతో మురళి, రేవతి ప్రాణాపాయం తప్పింది. ఉదయం మురళీ దంపతులు కిందకు వచ్చి వారిని లేపగా ఎంతకూ లేవకపోవడంతో అనుమానం వచ్చి తలుపు గడియలు పగల కొట్టి చూడగా, వారు విగతా జీవులుగా పడి ఉన్నారు. ద్విచక్ర వాహనాన్ని ఇంటిలో ఉంచి తలుపు గడియ పెట్టడం, గాలి వెళ్లడానికి ఏ మాత్రమూ అవకాశం లేకపోవడం, బైక్ నుంచి వచ్చిన కార్బన్ మోనాక్సైడ్‌ను నిద్రలో పీల్చడం వల్ల వారి నలుగురూ మృతి చెంది ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ సిఐ సుబ్బరాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇటీవల జరిగిన గంగ జాతర సందర్భంగా మురళి దంపతుల పెద్ద అమ్మాయి సుమ బిందు తన మేనత్త ఇంటికి వెళ్లింది. దీంతో, ఆమె ఈ ప్రమాదం నుంచి బయటపడింది.

## రానున్న 3 రోజులు తేలికపాటి వర్షాలు



**అమరావతి** : రాష్ట్రంలో రానున్న మూడు రోజులు ఓవైపు ఎండలు, మరోవైపు మేఘావృతమై విభిన్న వాతావరణం నెలకొన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ద్రోణి, నైరుతి దిశ నుంచి వీచే గాలుల ప్రభావంతో సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఆకస్మిక వర్షాలతో పడే పిడుగుపాటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించింది.

# సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026 సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి వస్తున్న సలహాలు, సూచనలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, రాష్ట్రంలోని పరిస్థితులపై వంటి అంశాల గురించి వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు, food safety department director neelakanta reddy, ఇతర అధికారులతో మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ నేడొక ప్రకటన జారీచేశారు.



**'అవేర్' ద్వారా 4-5 రోజుల ముందుగానే హెచ్చరికలు :** అవేర్ ప్లాటుఫామ్ ద్వారా రానున్న 4 నుంచి 5 రోజుల్లో వేసవి తీవ్రత ఎలా ఉంటుందన్న సమాచారం తెలుసుకునేవిధంగా ఏర్పాట్లు జరిగాయి. వాతావరణం కేంద్రాల ద్వారా అందే సమాచారం ఆధారంగా
ఏ ప్రాంతాల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉశీదో గుర్తిస్తారు. ఈ సమాచారం జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులకు అందుబాటులో ఉంటుంది. దీనికి అనుగుణంగా వీరు చర్యలు తీసుకుంటారు.

**అప్రమత్త చేసేలా.. :** 27 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 32 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదు జరిగితే...దానిని 'హెచ్చరిక (కాషన్)గా గుర్తిస్తున్నారు. 33 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 41 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదైతే దానిని 'అపాయం-డేంజర్లో ' ఉన్నట్లు, 42 నుంచి 54 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదైతే దానిని 'మరింత అపాయం' (వెరీ డేంజర్)గా అవేర్ డిజిటల్ ప్లాటుఫాంలో గుర్తిస్తారు.
గతంలో ( హిస్టారికల్ డేటా ఆధారంగా) ఉష్ణోగ్రతల నమోదు ఆధారంగా కూడా జాగ్రత్తలు తీసుకునేందుకు 'అవేర్' డిజిటల్ ప్లాటుఫారమ్ను కూడా ఉపయోగిస్తున్నారు. సీజనల్ వ్యాధులను రియల్ టైమ్లో పర్యవేక్షించి, వ్యాధులు వ్యాప్తిచెందకుండా చర్యలు తీసుకునేందుకు ఆర్టీజీఎస్లోని 'అవేర్ (అడ్వాన్స్ వార్నింగ్ అడ్వైయిజరీ ఫర్ రిసిలియెంటు ఎకోసిస్టమ్) సేవలను ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖ వినియోగించుకుంటోంది. గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలోని ఏయే జిల్లాల్లో, మండలాల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉందో మ్యాపింగ్ ద్వారా తెలుసుకునేలా ఏర్పాటుచేశారు ఐహెచ్ఐపీ పోర్టల్ ద్వారా రోజూవారీ డేటా సేకరణ నిర్వహిస్తూ రియలుటైం మానిటరింగ్ చేస్తున్నారు.

**శిక్షణ కార్యక్రమాలతో సన్నద్ధం! :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సర్వైలెన్స్ ఆఫీసర్స్, ఎపిడిమియాలజిస్టులు, ఎన్.సి.డి. ప్రోగ్రాం ఆఫీసర్లకు సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026 గురించి వర్చువల్ విధానంలో వివరించారు. వీరి ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి తిరిగి శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు జరుగుతున్నాయి. అలాగే కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు జాతీయ స్థాయిలో భాగంగా జిల్లాల్లో ఉండే వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో వర్చువల్‌గా శిక్షణ ఇచ్చారు హీటు స్ట్రోక్ (వడ దెబ్బ) కేసులు ఎలా గుర్తించాలి? పోర్టలు (ఎన్పీసీసీహెచ్‌ఎచ్-ఐహెచ్ఐపీ)లో ఎలా నమోదు చేయాలి, ఇతర అంశాల గురించి వివరించారు దీనికి అనుగుణంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు కూడా జిల్లా అధికారులకు వివరించారు.

**ముందస్తు జాగ్రత్తలు! :** ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వడదెబ్బకు గురైన వారికి ప్రాథమిక చికిత్స అందించేలా ఏర్పాట్లు జరిగాయి. కేసు తీవ్రత అనుసరించి ఉన్నత చికిత్స నిమిత్తం ఉన్నతస్థాయి ఆసుపత్రులకు 108 అంబులెన్సుల ద్వారా తరలించేలా ప్రణాళికలు సిద్ధంచేశారు ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) ప్యాకెట్లు 1,71,66,381) అన్ని ఆసుపత్రుల్లో సిద్ధంచేశారు. పీహెచ్సీల్లో 50,74,423, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 16,77,787 చొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయని మంత్రి సత్యకుమార్ తెలిపారు అవసరాలకు తగ్గట్లు ఐవీ ఫ్లూయిడ్స్ కూడా సిద్ధంచేసినట్లు చెప్పారు.

**సహచర శాఖలతో సమన్వయం! :** గర్భిణులు, వృద్ధులు, శిశువులు, నిర్మాణ రంగం కూలీలు, గ్రానైటు, నరేగా వర్కర్స్, ట్రాఫిక్ పోలీసులు, వేసవి తీవ్రతకు ప్రభావితమయ్యే ఇతర రంగాల వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని జిల్లా అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, కార్పొరేషన్, డిజాస్టర్ మేనేజ్మెంటు, పోలీసు, ఫైర్ అండ్ సేఫ్టీ, విద్యుత్తు, గ్రామీణ నీటిపారుదల, విద్యా శాఖ, కార్మిక, ఇతర శాఖల వారితో సమన్వయంతో వ్యవహరించి, వేసవితీవ్రతకు దూరంగా ఉండేలా ప్రజల్లో అవగాహన తేవాలని మంత్రి స్పష్టంచేశారు. వేసవి తీవ్రతకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో జూన్ వరకు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

**కేసుల నమోదు వివరాలు! :** రాష్ట్రంలో 2023లో 833, 2024లో 4,444, 2025లో 5,154 చొప్పున కేసుల నమోదు జరిగింది రిపోర్టింగ్ పెరిగేకొద్దీ కేసులు పెరుగుతున్నాయి. 2025లో అత్యధికంగా ఏలూరు జిల్లాలో 1,284, కృష్ణా-1,214, విశాఖ-1,089, కడప-325, పల్నాడు జిల్లాలో 268 చొప్పున వడదెబ్బ కేసుల నమోదయ్యాయి. వేసవి తీవ్రత రాయలసీమ, సముద్రతీర ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. 2025లో కోనసీమలో అత్యధికంగా 47.7 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది.

# గ్యాస్‌పై ప్రజలు ఆందోళన చెందొద్దు

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. రియల్ టైమ్ డేటా విశ్లేషణ ఆధారంగా పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు.



ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గౌరవ ప్రధాని నేతృత్వంలో కేంద్రం, గౌరవ సీఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రుల బృందంతో పాటు అధికారుల బృందాలు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తూ భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. వదంతులు నమ్మవద్దని కోరారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం కారణంగా, నౌకల రవాణాకు ఆటంకం వల్ల సరఫరా వ్యవస్థలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని.. అయితే వ్యవస్థల పునరుద్ధరణకు, బలోపేతానికి, కొత్త మార్గాల అన్వేషణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం మార్గదర్శకాలతో రాష్ట్ర స్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇతర పెట్రోలియం ఉత్పత్తులను తగ్గించి, గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్రం దేశవ్యాప్త రిఫైనరీలను ఆదేశించిందని, దీనివల్ల ఉత్పత్తి 10 శాతం నుంచి 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కుటుంబాలపై ప్రభావం పడకుండా వంట గ్యాస్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ఆసుపత్రులు, వసతిగృహాల కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్యాస్ సిలిండర్లపై కేంద్రం కొన్ని పరిమితులు విధించిందని.. ప్రస్తుతానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు, డబుల్ సిలిండర్లు ఉన్నవారికి 32 రోజులకు సిలిండర్ పొందేలా మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. అనవసరంగా ఆందోళనకు గురికావద్దని, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

**బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు:** విపత్కర పరిస్థితులను లాభార్జన కోసం ఉపయోగించుకోవాలనే తలంపుతో ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గౌరవ సీఎం ఆదేశాలతో ప్రత్యామ్నాయాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే హోటళ్లు, గ్యాస్ డీలర్లు తదితర అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విపత్కర కాలంలో వివిధ రకాల వినూత్న ఆప్షన్లను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. ప్రజల సలహాలు, సూచనలను కూడా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 95 శాతం ఆన్‌లైన్ బుకింగ్‌లు జరుగుతున్నాయని, 88 శాతం వరకు ఓటీపీ ఆధారిత గ్యాస్ సిలిండర్ల డెలివరీలు జరుగుతున్నాయని.. ఈ శాతాన్ని పెంచాలని సంస్థలకు సూచించామన్నారు. ఆర్‌టీజీఎస్ తో పాటు కలెక్టర్ల కార్యాలయాల్లోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**పైప్డ్ గ్యాస్‌పై ప్రత్యేక దృష్టి:** ప్రత్యామ్నాయ వనరులను ఉపయోగించుకోవడంలో భాగంగా పైప్డ్ గ్యాస్‌పైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి దార్శనికతతో విజయవాడతో పాటు వివిధ నగరాల్లో విజయవంతంగా నడుస్తున్న పైప్డ్ గ్యాస్ నేడు వరంగా మారాయని పేర్కొన్నారు. నేచురల్ గ్యాస్‌ను సమర్థవంతంగా వినియోగించుకునే విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే దృష్టిసారించినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు.
సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, డైరెక్టర్ శ్రీవాస్ నుపుర్ అజయ్‌కుమార్, సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, సమన్వయ శాఖల ఉన్నతాధికారులు, చమురు సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టా మహేశ్‌పై ఆరోపణలు.. సీఎం చంద్రబాబు సీరియస్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబు.. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పుట్టా మహేశ్‌పై వచ్చిన ఆరోపణలను సీఎం సీరియస్‌గా తీసుకున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఇప్పటికే ఆయన్ను అధిష్ఠానం ఆదేశించింది. ఈ ఘటనపై మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును చంద్రబాబు ఆదేశించారు. డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదన్నారు. వ్యక్తులు, నేతల బలహీనతలు, తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వొద్దని చెప్పారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తోపాటు రితేశ్‌రెడ్డి, నమిత్, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డిలకు పాజిటివ్ వచ్చింది. మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని తన ఫామ్‌హౌస్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి వీకెండ్ పార్టీ ఏర్పాటు చేశారని.. దానికి పుట్టా మహేశ్ హాజరైనట్లు పోలీసు అధికారులు తెలిపారు.

**పుట్టా మహేశ్‌కు షోకాజ్ నోటీసులు**

ఎంపీ పుట్టా మహేశ్‌కు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మొయినాబాద్ డ్రగ్స్ ఘటనను పార్టీ సీరియస్‌గా తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై 5 రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సమగ్ర నివేదిక వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. మహేశ్ ఇచ్చే వివరణ ఆధారంగా అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు.

# ఇజ్రాయిల్‌పై విరుచుకుపడిన ఇరాన్



**టెహ్రాన్:** మధ్యప్రాచ్యంలో యుద్ధం 16వ రోజుకు చేరుకుంది. దాడులు, ప్రతి దాడులతో ఆ ప్రాంతం అట్టుడికిపోతోంది. అమెరికా, ఇజ్రాయిల్ దళాలు ఇరాన్‌లోని సెంట్రల్ ఇస్ఫహాన్ రాష్ట్రంపై క్షిపణి దాడులు జరిపాయి. ఫ్యాక్టరీలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు జరిపామని పేర్కొన్నా... జనావాసాలపై సైతం బాంబుల వర్షం కురిపించాయి. కనీసం పదిహేను మంది ప్రాణాలు కోల్పోయారు. వైమానిక దాడుల తర్వాత ఇస్ఫహాన్ నగరంలో దట్టమైన పొగలు వ్యాపించాయి. అటు ఇరాన్ కూడా ఇజ్రాయిల్ పైన, సౌదీ అరేబియా, కువైట్‌లోని అమెరికా స్థావరాల పైన దాడులు జరిపింది. గత 24 గంటల కాలంలో ఇరాన్ జరిపిన దాడులలో 108 మంది గాయపడ్డారని ఇజ్రాయిల్ తెలిపింది. దక్షిణ ప్రాంతం వైపు వచ్చి పడుతున్న క్షిపణులను అడ్డుకునేందుకు ఇజ్రాయిల్ గగనతల రక్షణ వ్యవస్థలు ప్రయత్నించాయి. ఇప్పటి వరకూ ఇరాన్ దాడులలో మూడు వేల మందికి పైగా ఆస్పత్రుల పాలయ్యారని ఇజ్రాయిల్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ చెప్పింది. ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను రియాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో అడ్డుకున్నామని సౌదీ అరేబియా తెలియజేసింది. గత నెల 28 నుంచి సౌదీలోని ఇంధన మౌలిక సదుపాయాలు, అమెరికా ఆస్తులు, సైనిక స్థావరాలు, పట్టణ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు చేస్తోంది. యుఎఇలో అమెరికాకు చెందిన అల్-ధఫ్రా వైమానిక స్థావరంపై ఇరాన్ పది క్షిపణులను ప్రయోగించింది. యుఎఇలోని ఫుజైరా ఓడరేవు వద్ద దట్టమైన పొగలు వ్యాపించాయి. యుఎఇ పైనే 33 డ్రోన్లు, తొమ్మిది బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. కువైట్ గగనతలంలోకి ఏడు ఇరాన్ క్షిపణులు ప్రవేశించాయి. వీటిలో రెండు క్షిపణులు అహ్మద్ అల్-జబర్ వైమానిక స్థావరాన్ని తాకాయి. అంతర్జాతీయ విమానాశ్రయంపైనా దాడి జరగడంతో అక్కడి రాడార్ దెబ్బతింది. ఖతార్‌పై కూడా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు విరుచుకుపడ్డాయి.

**దెబ్బతిన్న ఇరాన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం**

ఇరాన్ ప్రతిదాడులతో ఇజ్రాయిల్ అసహనానికి గురవుతోంది. జనావాసాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తోంది. ఇజ్రాయిల్, అమెరికా దాడులలో పశ్చిమ టెహ్రాన్‌లోని ఇరాన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం దెబ్బతింది. ఇరాన్‌లోని ఫార్స్ రాష్ట్ర రాజధాని షరాజ్‌లో జనావాస ప్రాంతాలపై దాడులు జరిగాయి. అమెరికా, ఇజ్రాయిల్ సేనల దాడిలో ఆ ప్రాంతాలన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. లెబనాన్‌లోని దక్షిణ ప్రాంతంలో ఉన్న సిడాన్ నగరంలో నివాస భవనంపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ఓ వ్యక్తి చనిపోయాడు.

**'సరదా' కోసం ఖర్గ్‌పై మళ్లీ దాడి : ట్రంప్**

బాగ్దాద్‌లోని అమెరికా ఎంబసీ లోపల ఉన్న హెలిపాడ్‌పై క్షిపణి దాడి జరగడం, ఫుజైరాలోని చమురు స్థావరంపై జరిగిన డ్రోన్ దాడిని అడ్డుకునే క్రమంలో శిధిలాలు ఆ స్థావరంపై పడడం వంటి ఘటనల నేపథ్యంలో గల్ఫ్‌లోని ఇంధన మౌలిక సదుపాయాలు, నౌకా మార్గాల భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇరాన్‌లోని ఖర్గ్ దీవిపై మరోసారి దాడి చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఆ దీవి ఇప్పటికే చాలా వరకూ ధ్వంసమైందని, 'సరదా కోసం' మరికొన్ని సార్లు దానిపై దాడి చేస్తామని చెప్పారు. యుద్ధానికి ముగింపు పలకడానికి చర్చలకు ఇరాన్ సంసిద్ధంగానే ఉన్నప్పటికీ దాని షరతులు తమకు అంగీకారయోగ్యం కావని స్పష్టం చేశారు. ఖర్గ్ దీవిపై మరిన్ని దాడులు జరిపినా, హర్మూజ్ జలసంధిని మూసివేసేందుకు ప్రయత్నించినా ఘర్షణలు మరింత ముదిరి అంతర్జాతీయ చమురు మార్కెట్లకు ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరించారు.

**ఆ రెండు దేశాల నౌకల పైనే నిషేధం : ఇరాన్**

హర్మూజ్ జలసంధిని అమెరికా, ఇజ్రాయిల్ నౌకలకు మాత్రమే మూసివేశామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వివరణ ఇచ్చారు. తమ పైన, మిత్ర దేశాల పైన దాడులు చేస్తున్న శత్రువుల నౌకలు, ట్యాంకర్లు తిరగకుండా మాత్రమే దానిని మూసివేశామని తెలిపారు. ఇతర దేశాల నౌకలన్నీ స్వేచ్ఛగా ప్రయాణించవచ్చునని అన్నారు. రష్యా, చైనాలు మీకు సైనిక, ఇంటెలిజెన్స్ మద్దతు ఇస్తున్నాయా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు అరాగ్చీ జవాబిస్తూ ఆ దేశాలు తమకు వ్యూహాత్మక భాగస్వాములని చెప్పారు. గతంలో వాటితో తమకు సన్నిహిత సహకారం ఉన్నదని, ఇక ముందు కూడా అది కొనసాగుతుందని తెలిపారు.

**నెతన్యాహూ సేఫ్ : ఇజ్రాయిల్**

ఇరాన్ దాడులలో తమ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చనిపోయారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై ఇజ్రాయిల్ స్పందించింది. అవి తప్పుడు వార్తలని, ప్రధాని క్షేమంగానే ఉన్నారని నెతన్యాహూ కార్యాలయం తెలిపింది. నెతన్యాహూ తన ఎక్స్ ఖాతాలో శుక్రవారం ఓ వీడియోను పోస్ట్ చేశారు. ఆ వీడియోలో నెతన్యాహూ కుడి చేతికి ఆరు వేళ్లు కనిపించాయని, అది ఏఐ సాయంతో తీసిన వీడియోలా కన్పిస్తోందని సోషల్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వార్తలను నెతన్యాహూ కార్యాలయం తోసిపుచ్చుతూ ఆయన సురక్షితంగానే ఉన్నారని తెలిపింది.

**మొజ్తాబా చనిపోయారేమో : ట్రంప్**

ఇరాన్ నూతన సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సజీవంగా ఉన్నారా లేదా అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సందేహాన్ని లేవనెత్తారు. మొజ్తాబా జీవించి ఉన్నారని చెప్పడానికి తన వద్ద ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లేవని ఆయన అన్నారు. సుప్రీం నేతగా ఎన్నికైన తర్వాత మొజ్తాబా తొలి సందేశం లిఖితపూర్వకంగానే ఉంది తప్ప ఆయన ప్రజల ముందుకు రాలేదని గుర్తు చేశారు. మొజ్తాబా సజీవంగా ఉన్నారని తాను అనుకోవడం లేదని, ఆయనను ఇప్పటి వరకూ ఎవరూ చూడలేదని చెప్పారు. ఒకవేళ మొజ్తాబా జీవించి ఉంటే తన దేశం కోసం లొంగిపోయి ఉండేవారని ట్రంప్ అన్నారు. చర్చలకు ఇరాన్ సిద్ధంగానే ఉన్నప్పటికీ దాని షరతులు సరిగా లేవని తెలిపారు. మధ్యప్రాచ్యంలోని మిత్ర దేశాలు చేస్తున్న దౌత్య ప్రయత్నాలకు ట్రంప్ ప్రభుత్వం మోకాలడ్డుతోందని రాయిటర్స్ వార్తాసంస్థ తెలిపింది. యుద్ధం నాలుగైదు వారాల పాటు జరగవచ్చునని తొలుత ట్రంప్ అంచనా వేశారు. మరింత సమయం పట్టవచ్చునని తాజాగా ఆయన అంచనాకు వచ్చారు. ఇరాన్‌లో ఏ లక్ష్యాన్ని మిగల్చకూడదని ఆయన భావిస్తున్నారు.

**ఇరాన్ యుద్ధంలో హౌతీలు ?**

మరో జలసంధి మీదుగా రవాణాకు గండం ఇరాన్ యుద్ధంలో యెమన్‌కు చెందిన హౌతీలు కూడా భాగస్వాములు కాబోతున్నారని వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమైతే హర్మూజ్‌లో జరుగుతున్న విధంగానే బాబ్ ఎల్-మందేబ్ జలసంధిలో కూడా నౌకల రాకపోకలకు ఆంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటి వరకూ హౌతీలు యుద్ధానికి దూరంగా ఉన్నారు. మధ్యప్రాచ్యంలో ఇరాన్ అనుసరిస్తున్న 'మూడు దశల వ్యూహం'లో హౌతీలు భాగంగా ఉన్నారని నిపుణులు అంటున్నారు. హౌతీలు అప్రమత్తంగానే ఉన్నారని, యుద్ధంలో వారు ఇరాన్‌తో జత కలవవచ్చునని ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. హౌతీలు యుద్ధంలో చేరితే బాబ్ ఎల్-మందేబ్ జలసంధి మూతపడుతుందని చెప్పింది. అరేబియన్ ద్వీపకల్పం దక్షిణ కొనలో ఉన్న ఈ ఇరుకైన మార్గం ఎర్ర సముద్రం మీదుగా సూయజ్ కాలువలోకి నౌకల ప్రయాణానికి వీలు కల్పిస్తోంది.

# సిరికొండ మండల్ రీల్స్ ఛలెంజ్ యువత మేలుకో - గంజాయి మానుకో

**నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం**




మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : :సిరికొండ మండలంలో యువతలో ఉన్న సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు గంజాయి వంటి మత్తు పదార్థలపై అవగాహన కల్పించేందుకు "సిరికొండ మండల్ రీల్స్ ఛాలెంజ్ యువత మేలుకో - గంజాయి మానుకో" అనే ప్రత్యేక కార్యక్రమన్ని హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్నారు. ఫౌండేషన్ చైర్మన్ అయినాల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వార మండలంలోని అన్ని గ్రామల యువకులకు తమ ప్రతిభను ప్రదర్శించే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా యువత తమతమ గ్రామల సామాజిక, సాంస్కృతిక సంప్రదాయలు, పల్లె మనుషుల జీవన విధానం, గ్రామ అభివృద్ధి వంటి అంశాలపై వీడియో రీల్స్ రూపొందించి పాల్గొనవచ్చు. గ్రామల అందాలు, రైతులు మరియు పంటలు, ఆలయలు, సంప్రదాయలు, పండుగలు వంటి ప్రత్యేకతలను వీడియోల రూపంలో చూపిస్తూ తమ గ్రామన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం ఈ కార్యక్రమం ద్వార లభిస్తుందాని అన్నారు. వీడియో నిబంధనల ప్రకారం రీల్ పొడవు ఐదు నిమిషాలకు మించకూడదు. వీడియోలో గంజాయి వంటి మత్తు పదార్థలను అరికట్టే సందేశంతో పాటు గ్రామ అందాలు, రైతులుపంటలు, ఆలయలు సంప్రదాయలు, గ్రామ అభివృద్ధి వంటి అంశాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రఖ్యాత న్యాయనిర్ణేతల పరిశీలన ఆధారంగా ఉత్తమ వీడియోలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేయబడతాయి. ఈ కార్యక్రమనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువత మత్తు పదార్థలకు దూరంగా ఉండి తమ ప్రతిభను సమాజనికి ఉపయోగపడే విధంగా ప్రదర్శించాలని కోరారు.

# వికారాబాద్ బీజేఆర్ చౌరస్తాలో డ్రైనేజ్ సమస్యలు ప్రజలకు పెరుగుతున్న ఇబ్బందులు

**మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం మురికికూపంగా బిజెర్ చౌరస్తా పైకప్పులేని మోరీలువాహనదారులకు ఇబ్బందులు**




(జర్నలిస్ట్ ఫైల్) వికారాబాద్ మార్చి 15 : వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా ప్రాంతంలో డ్రైనేజ్ సమస్యలు తీవ్రంగా మారి ప్రజలకు పెద్ద ఎత్తున ఇబ్బందులు కలిగిస్తున్నాయి. చౌరస్తా పరిసరాల్లో ఉన్న కాల్వల్లో మురికినీరు నిల్వ ఉండటం వల్ల అవి మురికికూపంలా మారి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. రోజూ ఈ ప్రాంతం గుండా ప్రయాణించే ప్రజలు, వ్యాపారులు, పాదాచారులు ఈ పరిస్థితుల కారణంగా తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.ఇంకా బీజేఆర్ చౌరస్తా నుండి రామయ్యగూడ రోడ్ వరకు ఉన్న రహదారిలో డ్రైనేజ్ సమస్య మరింత తీవ్రమైంది. కాల్వల్లో పేరుకుపోయిన మురికిని తొలగించేందుకు అధికారులు మోరీల పైకప్పులను తొలగించినప్పటికీ వాటిని తిరిగి సరిగా ఏర్పాటు చేయలేదు. దీంతో రహదారి పక్కనే ఓపెన్‌గా ఉన్న డ్రైనేజ్ గుంటలు వాహనదారులు మరియు పాదాచారులకు ప్రమాదకరంగా మారాయి.ప్రత్యేకంగా అస్సాం బేకరి సమీపంలో డ్రైనేజ్ కాల్వకు సరైన సెక్యూరిటీ గోడలు లేదా రక్షణ ఏర్పాట్లు లేకపోవడం వల్ల పలుమార్లు వాహనదారులు ప్రమాదవశాత్తు కాల్వలో పడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళల్లో లేదా వర్షాకాలంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు అవగాహన ఉన్నప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో శాశ్వత పరిష్కారం చూపలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలు పొంగిపోతే లేదా దుర్వాసన ఎక్కువైతే తాత్కాలికంగా శుభ్రపరిచే చర్యలు మాత్రమే తీసుకుంటున్నారని, కానీ సమస్యకు మూలంగా ఉన్న డ్రైనేజ్ వ్యవస్థను పునర్నిర్మించడం లేదా రక్షణ ఏర్పాట్లు చేయడం వంటి స్థిరమైన చర్యలు





తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.కాబట్టి పట్టణంలోని ఈ కీలక ప్రాంతంలో డ్రైనేజ్ వ్యవస్థను పూర్తిగా పునరుద్ధరించి, మోరీలపై సురక్షితమైన పైకప్పులు ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ గోడలు నిర్మించి శాశ్వత పరిష్కారం కల్పించాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ఇలా చేయడం వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు తగ్గి, ప్రమాదాలు కూడా నివారించవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

# రోడ్డు భద్రత - సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి డీసీపీ బి. రామ్ రెడ్డి**

మంథని, మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక నృసింహ శివ కిరణ్ గార్డెన్ లో మంథని పోలీస్ లు పిల్లల భద్రత, మత్తు పదార్థాల వినియోగంఅనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి రమేష్, ప్రవచనకర్త నాయక్ మహారాజ్, మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుదుదల వెంకన్న, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా మంథని ఎస్ఐ రమేష్ ముఖ్య అతిథులకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.....మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తైనా నాశనం అవుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం,శక్తిని క్రీడలు, చదువు, సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని,ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని, ఎవరికైనా అలాంటి




అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువతలోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం వరకు యువకులే బాధితులవుతున్నారని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారును నడిపే సమయంలో సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ఎప్పుడూ రహదారి ఎడమ వైపునే ప్రయాణించాలని, భారీ వాహనాలనుదాటేటప్పుడు జాగ్రత్తలుపాటించాలని చెప్పారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు. సైబర్ నేరాల విషయంలో కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం,అనుమానాస్పద లింకులు పంపడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గతంలో తల్లిదండ్రులు అపరిచితులు ఇచ్చే చాక్లెట్‌లను తీసుకోవద్దని చెప్పేవారని, ఇప్పుడు అదే మోసం మొబైల్ ఫోన్ ద్వారా వచ్చే లింకులు, మెసేజ్‌ల రూపంలో జరుగుతోందని వివరించారు. మొబైల్ ఫోన్ ద్వారా ప్రపంచంతో అనుసంధా నం సాధ్యమవుతున్నప్పటికీ, అదే సమయంలో సైబర్ నేరస్థులకు కూడా అవకాశం కలుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, గ్రామ సర్పంచులు, మాజీ సర్పంచులు, పోలీస్ సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



# మెడికల్ కోడింగ్ అండ్ బిల్లింగ్ శిక్షణ కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



మంథని/పెద్దపల్లి, మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : పెద్దపల్లి జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెడికల్ కోడింగ్ అండ్ బిల్లింగ్ శిక్షణ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 16వ తేదీ నుండి పెద్దపల్లి టాస్క్ రీజినల్ సెంటర్‌లో ప్రారంభం కానుంది. ప్రస్తుతం హెల్త్‌కేర్ రంగంలో మెడికల్ కోడింగ్, బిల్లింగ్‌కు మంచి డిమాండ్ ఉన్నందున జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఫార్మసీ, బయోటెక్నాలజీ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కోర్సులో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు పెద్దపల్లి టాస్క్ రీజినల్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.సంప్రదించవలసిన చిరునామా: టాస్క్ రీజినల్ సెంటర్ , పెద్దపల్లి ఫోన్ నంబర్: 9059506807శిక్షణకు హాజరు కావడం తప్పనిసరి అని, పూర్తి హాజరు ఉన్న విద్యార్థులకు మాత్రమే సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# గొర్రెగుట్ట శ్రీ.శ్రీ.శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ఏకాదశ(11)వ వార్షికోత్సవ ఆహ్వానం

**కోరిన కోరికలు తీర్చే శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు**




దమ్మపేట ప్రతినిధి మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : దమ్మపేట మండల పరిధిలో గల గొర్రెగుట్ట గ్రామంలో గల అతి పురాతనమైన స్వయంభు క్షేత్రముగా విరజిల్లుతున్న శ్రీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయా ఏకాదశ(11)వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి దివ్య కళ్యాణోత్సవం మరియు బ్రహ్మోత్సవములు నేటి నుంచి అనగా ఆదివారం 15/3/26 నుంచి 18/3/26 బుధవారం వరకు నిర్వహించబడును అని 15 వ తారీకు ఆదివారం ఏకాదశి ఉదయం మంగల తోరణం అంకురారోహణం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాలికాస్థాపనశీ, వైనతేయ పూజ సేవా కాలం, మహా నివేదన మహా మంత్రపుష్పం, అనంతరం సాయంత్రం వైనతేయ హోమం నిర్వహించబడునని మరుసటి రోజు 16వ తారీకు సోమవారం ద్వాదశి రోజున విశ్వక్సేన పూజ, గరుడ ధ్వజ పతకారోహణం, స్వామివారికి చందనోత్సవం, సహస్రనామఅర్చన, మహా నివేదన మహామంత్ర పుష్పం అనంతరం సాయంత్రం కరవలంబ నృసింహ కవచ హోమం నిర్వహించబడునని 17వ తారీకు మంగళవారం త్రయోదశి రోజున మంగళ స్నానాలు, నూతన వస్త్రాలంకరణ ఉదయం తొమ్మిది గంటల నుండి అంగరంగ వైభవంగా స్వామి వారి దివ్య శాంతి కళ్యాణ మహోత్సవం అనంతరం ఉదయం 11 గంటల నుండి మహా అన్నదాన( నారాయణ సేవ) కార్యక్రమం సాయంత్రం నరసింహ లక్ష్మీ మూల మంత్ర హోమం, 18 వ తారీకు బుధవారం చతుర్దశి రోజున ఉదయం 10 గంటల నుండి మహానృసింహ సుదర్శన హోమం పూర్ణహుతి నిర్వహించబడునని పై పూజ కార్యక్రమములన్నీ ఆలయ అర్చకులు చంద్రశేఖరాచార్యులు నిర్వహించబడునని ఆలయ ట్రస్టీ అడపా రామకృష్ణారావు మరియు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు



# 9వ వార్డులో ప్రజా పాలన ప్రగతి- ప్రణాళిక కార్యక్రమము



మంథని, మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమములో భాగంగా మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యములో ఈ రోజు మంథని మున్సిపల్ పరిధిలోని వార్డ్ నెం. 09 (మందాట, నడివీధి, లక్ష్మి నారాయణ స్వామి టెంపుల్ ఏరియా) లలో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహించిన స్థానిక కౌన్సిలర్ మారుపాక నిహారిక. ఈ కార్యక్రమములో మురికి కాలువలు, రోడ్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీ సమస్యలను పాలక వర్గ సభ్యులకు సమాచారం తెలిపిన తక్షమే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు కుర్ర లింగయ్య, జంబోజు శ్రీమతి, ఎల్లంకి వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కోతుల బాధ లేకుండా చేస్తాం

**04 వ వార్డ్ కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు**



మంథని, మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : మంథని మున్సిపల్ పరిధిలో కోతుల బాధ లేకుండా చేస్తామని 04వ వార్డ్ కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం 04 వార్డు పరిధిలో ప్రత్యేకంగా కోతులను పట్టడానికి బోన్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. కోతుల సంచారం అధికంగా ఉండడంతో జనజీవనం ప్రశ్నార్థకమవుతుంది. గతంలో కన్నా కోతుల సంచారం అధికం కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు ఇచ్చిన మాట ప్రకారం శనివారం నాడు గంగాపురి ప్రభుత్వ పాఠశాలలో కోతులకు ప్రత్యేకమైన బోను ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎలక్షన్ అనంతరం మంథని మున్సిపల్ ఆఫీసులో పత్రికా సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డు కౌన్సిలర్లు కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రజల వద్ద వాగ్దానం చేశారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా మున్సిపల్ ఇందుకు సంబంధించిన సిబ్బందిని నియమించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రత్యేకంగా కోతుల కొరకు నియమించిన సిబ్బంది నిరంతరం మున్సిపల్ పరిధిలోని అన్ని వాడల్లో ఈ కార్యక్రమం చేయనున్నట్లు నాలుగో వార్డ్ కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుంది.

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి. గ్రామ సర్పంచ్ భాసాన్ని బుచ్చిరెడ్డి. ఉప సర్పంచ్ మచ్చ అనిల్ కుమార్.**



ఇబ్రహీంపట్నం మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : యాచారం మండల పరిధిలోని గున్ గల్ గ్రామానికి మండలంలోని అభివృద్ధి పనులలో భాగంగా అధిక మొత్తంలో కేటాయించినందుకు సంతోషంగా ఉంది అని గ్రామ సర్పంచ్ బాసాని బుచ్చిరెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ యాచారం మండలానికి రెండు కోట్ల 21 లక్షల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులకు విడుదల చేయడమైనది జరిగింది అని అన్నారు. గున్ గల్ గ్రామ సర్పంచ్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, ముందు ముందు మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి నేను తీర్చి దిద్దడానికి నా సహాయ శక్తుల పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గున్ గల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని ముందుకు వచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు వార్డు నెంబర్లు మాజీ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు,సర్పంచ్ బాసాని బుచ్చి రెడ్డిఉప సర్పంచ్ మచ్చ అనిలకుమార్ వైస్ ఎంపీపీ కె శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్ ,మాజీ ఎంపీటీసీ యాదయ్య , గ్రామ శాఖ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, గిర మోని సుదర్శన్ , వార్డు నెంబర్స్ పి సాయి కుమార్, చెంచాల మధుసుధన్ ,కుంటి లావణ్య ప్రేమ్ కుమార్, గొట్టం పద్మ, పంతగి సుగుణమ్మ, బుర్కి నవనీత శ్రీకాంత్ ,కొంగర సాయి చరణ్ ,సీనియర్ నాయకులు మచ్చ లక్ష్మణ్,బుర్కి అశోక్,కుంటి నరేష్ కుమార్, పి ఎస్ శ్రీకాంత్ ,పతంగి సురేష్ ,మన్నే రాజు, అదేవిధంగా అధికారులు శోభారాణి ఎంపీ ఓ తదితరులు మండల అధికారి సిబ్బంది అదేవిధంగా గ్రామపంచాయతీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన జిల్లా కాంగ్రెస్ డీసీసీ కార్యదర్శి.

**వెల్మ భాస్కర్ రెడ్డి.**

**నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం**



మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : :సిరికొండ మండలం చీమన్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ రాజేందర్ రెడ్డి చెల్లెలు వివాహ వేడుకలో జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరువులకు ఆశీర్వదించాడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# రూరల్ ఎమ్మెల్యే చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి

**- షాది ముబారక్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు.**

**నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం**



మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : సిరికొండ మండలంలోని సర్ పల్లి మరియు పెద్దవాల్గోట్ గ్రామల లబ్ధిదారులకు శనివారం డిచ్ పల్లి మండలంలోని ఖచీ= గార్డెన్ లో రూరల్ శాసనసభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ అందజేయడం జరిగింది. లబ్దిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద వాల్గోట్ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్, సర్ పల్లి సర్పంచ్ చందర్ నాయక్, ఉప సర్పంచ్ తలకట్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన శాఖాద్వారా రైతులకు విత్తనాలు సరఫరా చేసిన షాద్నగర్ ఎమ్మెల్యే



షాద్నగర్ నియోజకవర్గం మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : ఉద్యాన శాఖ ద్వారా వేసవిలో కూరగాయల దిగుబడి పెంచాలి అన్న ఉద్దేశంతో కూరగాయ విత్తనాలు (టమాట, చిక్కుడు, మిరప, సొరకాయ)0.20 గుంటలకి సరిపోయే విధంగా మినీ కిట్ రైతులకు100% సబ్సిడీ పై అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం భాగంగా లో షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ వివిధ గ్రామాల రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడుతున్న ఈ విత్తనాలను అందరూ రైతులు తీసుకొని ఈ వేసవి కాలం లో పండించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో వీణా స్మృతీబ,మున్సిపల్ చైర్మన్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,వివిధ గ్రామాల సర్పంచులు , ఉద్యాన అధికారి,హిమ బిందు, ఉద్యాన విస్తరణ అధికారి మరియు రైతులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు సంస్కృతి,సంప్రదాయాలను అలవర్చుకోవాలి

**సిద్ధార్థ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ జి.నాగయ్య**

**కళాశాలలో ఆకట్టుకున్న టెక్ వైబ్స్ అన్యువల్ డే సెలబ్రేషన్స్**

**విద్యార్థులను ఉర్రూతలూగించిన ప్రముఖ గాయకుల మధుర గానాలు**




ఇబ్రహీంపట్నం మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : హైదరాబాద్ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలలో కళాశాలలో "టెక్ వైబ్స్ అన్యువల్ డే సెలబ్రేషన్స్ 2026" వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల ఉత్సాహంతో ఉల్లాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ జి.నాగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మొదటి, రెండో, మూడో మరియు తుదివ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించినవారికి, అలాగే అత్యధిక హాజరు కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ నాగయ్య మరియు కళాశాల ప్రిన్సిపాల్ పి.శేఖర్ బాబు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ నాగయ్య మాట్లాడుతూ... విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మక కార్యకలాపాలలో కూడా పాల్గొనాలని సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన ఉంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను సాధించవచ్చని తెలిపారు. కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను సమాజానికి ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వేడుకలకు వినోదాత్మక రంగు జోడిస్తూ సినీ నేపథ్య గాయని గీతా మాధురి, గాయకులు సాత్విక్ కొండూరి, గోవింద ఆచార్య పాల్గొని తమ మధుర గానంతో విద్యార్థులను అలరించారు. వారి పాటలకు విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ కార్యక్రమాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ డి ప్రదీప్ కుమార్, డైరెక్టర్ జి భగత్, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, కన్వీనర్లు పీ రఘు, కీర్తివర్ధన్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం మీద "టెక్ వైబ్స్ 2026" వేడుకలు కళాశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే వేదికగా నిలిచి అందరికీ మరిచిపోలేని అనుభూతిని అందించాయి.



## మండల కేంద్రంలో పోచమ్మ గుడి ప్రాంగణంలో చలివేంద్రం ప్రారంభించిన ఎంపీడీవో మనోహర్ రెడ్డి

నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం



మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : సిరికొండ మండల కేంద్రంలో గల పోచమ్మ దేవాలయం ఆవరణంలో శుక్రవారం ప్రజల దాహార్తిని తీర్చడానికి సిరికొండ ఉపసర్పంచ్ గ్యమ శోభన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడంతో ఈ చలివేంద్రన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల ప్రజపరిషత్ అధికారి కేఆర్ మనోహర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. ఎంపీడీవో మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలు ఈ చలివేంద్రాలను వినియోగించుకోవలని కోరారు. గ్రామప్రజలు,నాయకులు, యువకులు ఉపసర్పంచ్ శోభన్ కి అభినందనలు తెలిపారు.

## మంత్రి శ్రీధర్ బాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు

ఎంసిపిఎఫ్ అధ్యక్షులు డేవిడ్



మంథని, మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : మంథని నియోజకవర్గంలో మైనారిటీ నిదులలో కాంపౌండ్ వాల్ పొందుకున్న దైవ సేవకులు మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో కృతజ్ఞతలు తెలుపుటకు ప్రతి మండలం నుంచి వచ్చి ఉన్నారు. నిధులు మంజూరు చేసిన మినిస్టర్ కు ప్రతి మండలం నుంచి వచ్చిన దైవ సేవకులు కృతజ్ఞతలు తెలుపుతూ చేసిన మేలుని జ్ఞాపకం చేసుకొన్నారు. గత 15 సంవత్సరాలుగా ఎలాంటి మైనార్టీ నిధులు ఈ ప్రాంతంలోని దైవ సేవకులు పొందుకోలేదు. వచ్చిన ఈ విధుల పట్ల కొంతమంది దైవ సేవకులు విషపూరితమైన వ్యాఖ్యలు చేయటం అనుచితముగా ఉన్నది ఈ నిధులు దుర్వినియోగం అయినవని పత్రికా ప్రకటన చేయుటను బట్టి నియోజకవర్గ కమిటీగా ఎంసిపిఎఫ్ ఖండిస్తున్నాము. పొందుకున్న ప్రతి దైవ సేవకుడు గత 20 సంవత్సరాలుగా దేవుని సేవ చేయుచు దేవుని మీద ఆధారపడి ఉన్నారు. అందుకున్న ప్రతి దైవ సేవకుడు కాంగ్రెస్ పార్టీకి మరియు శ్రీధర్ బాబు కు నమ్మకం గా ఉండటం బట్టి ముందు వరసలో వారి యొక్క పేర్లు ఎంపిక చేయడం జరిగినది. తర్వాతి బడ్జెట్లో కూడా మిగిలిన సేవకులను ఎంపిక చేస్తామని మానివేయడం జరిగినది కాబట్టి ఇట్టి విషయాన్ని మనసును ఉంచుకొని విజ్ఞతతో ఉండగలరని దైవ సేవకులకు విన్నవించుకుంటున్నాం. ఇట్టి కార్యక్రమంలో ఎం సి పి ఎఫ్ అధ్యక్షులు డేవిడ్, ఉపాధ్యక్షులు జయరాజు కార్యదర్శి అశోక్ సహకార దర్శి జోషి, కోశాధికారి దైవ కృపాకర్ కమిటీ సభ్యులతో పాటు పలిమెల మండలం నుండి జక్కయ్య, పీటర్,మహాదేవూరు మండలం నుండి శాంతి కుమార్ ,చందు,పెద్ద సామ్యేలు రాజ్ కుమార్,కాటారం మండలం రవి ప్రసాద్,సురేష్,మహా ముత్తారం మండలం యోహాను సుందర్ రావు, మలహార మండలం నాగేశ్వరరావు, బోయాజ్ ముత్తారం మండలం నుండి సామ్యేల్, దైవ సేవకులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా

కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్



షాద్నగర్ నియోజకవర్గం మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : షాద్ నగర్ పట్టణంలో ఎంపీడీఓ సమావేశం మందిరంలో షాద్ నగర్ మున్సిపలిటి చెందిన 20 లబ్ధిదారులకు రూ. 20 లక్షల22 వేల 320 రూపాయలు విలువ గల కళ్యాణలక్ష్మి, కొందుర్గ్ ,చౌదరర్ గూడెం ,ఫరూఖ్ నగర్ మండలకు చెందిన 140 మంది లబ్ధిదారులకు, మెత్తం 160 మంది ఒక్క కోటి 60 లక్షల 18 వేల 560 రూపాయలు గల చెక్కులను పంపిణీ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్.8ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సూచించారు.8ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తహసిల్దార్ నాగయ్య మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,కౌన్సిలర్లు శ్రావణి ,కొప్పునూరి ప్రవీణ్, మురళీమోహన్(అప్పి), పెంటయ్య,బచ్చలి నరేష్, దిలీప్, మాధవులు యాదవ్, జయప్రకాష్, ఫరూఖ్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ రెడ్డి, జిల్లేడు చౌదర్ గూడెం మండల పార్టీ అధ్యక్షుడు రాజు ,వివిద గ్రామాల, సర్పంచ్ల్ లు తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు..

## గుట్టలో వీరేందర్ జన్మదిన వేడుకలు



యాదాద్రి భువనగిరి జిల్లా మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : స్వామివారి భక్తుడు సురేందర్ 54వ పుట్టినరోజు వేడుకలు యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలను వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా పట్టణంలోని వైకుంఠ ద్వారం వద్ద కేక్ కట్ చేసి అభిమానులు స్థానికులకు పంపిణీ చేశారు అనంతరం పెద్ద ఎత్తున స్థానికులు భక్తులకు అన్నదాన నిర్వహించారు ఈ సందర్భంగా వడ్లజి వెంకటేష్ మాట్లాడుతూ వీరేందర్ 54వ పుట్టినరోజులు గుట్టలో నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు ఆయనకు సాయిబాబా ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిమ్మయ్య శ్రీకాంత్ రెడ్డి రాము సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



యాదాద్రి భువనగిరి జిల్లా మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : ఈపీఎఫ్ ను రద్దుచేసి జిపిఎఫ్ గా మార్చాలని వినతి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపిన ప్రభుత్వ విప్ ఐలయ్య ఈ పి ఎఫ్ నుండి జీపీఎఫ్ కు మార్పు విషయంలో 1999 నుండి 2003 మధ్యకాలంలో నియమితులైన విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, ప్రస్తుతం ఈ పి ఎఫ్ విధానంలో ఉండడం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు భద్రత ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ముఖ్యంగా పదవీ విరమణ అనంతరం నిరంతర పెన్షన్ సౌకర్యం లేకపోవడం వల్ల కార్మికులు మరియు వారి కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని వివరించారు. అలాగే వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్న నేపథ్యంలో వైద్య ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పెన్షన్ అనేది ప్రతి ఉద్యోగికి ఉండాల్సిన హక్కు అని కార్మికులు తెలిపారు. 1999 నుండి 2003 మధ్యకాలంలో నియమితులైన విద్యుత్ ఉద్యోగులను ఈ పి ఎఫ్ విధానం నుండి జీపీఎఫ్ విధానానికి మార్చి, వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ, ఈ అంశాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం వద్ద ప్రస్తావించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 1104 జిల్లా అధ్యక్షులు పడిగం యాదగిరి , మీర్జా షకీల్ బేగ్, టి. రమేష్ రెడ్డి, బొట్ల రాజేశ్వర్, గుమ్మడి ఆంజనేయులు, బండపల్లి ఆంజనేయులు, బాబురావు, నానచర్ల నరసింహ, రాజమల్లయ్య, సత్తయ్య, ఉప్పలయ్య, కే. శ్రీనివాస్ మరియు విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ పాల్గొన్నారు.

## క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్

క్రైస్తవ సమాజానికి పాటుపడుతున్న దీపక్ జాన్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఐసీపీసీ చైర్మన్ రెవ.కె.దినాకర్



ఇబ్రహీంపట్నం మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : క్రైస్తవ సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఐసీపీసీ చైర్మన్ రెవ.కె.దినాకర్, ఐయంపీసీ చైర్మన్ రెవ్.డి.కరుణాకర్, అసెంబ్లీ కోఆర్డినేటర్ పాస్టర్ ఎం.విక్టర్ సన్నుత్, తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఐసీపీసీలో ఉన్న సమస్యలు, ముఖ్యంగా గ్రేవియార్డ్స్‌కు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ దీపక్ జాన్ సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్రైస్తవ సమాజ సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని ఆయన వివరించారు. బీద విద్యార్థులకు స్టైఫండ్లు, మహిళలకు కుట్టు మిషన్లు, ఉపాధి కోసం లోన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ ఉన్న ప్రతి చర్చికి చర్చి అలంకరణ కోసం రూ.30 వేలు, క్రిస్మస్ సందర్భంగా లవ్ ఫీస్ట్ నిర్వహణకు రూ.2 లక్షలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీసీ సర్టిఫికెట్ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారికి స్వయంగా రెవిన్యూ అధికారులతో మాట్లాడి సర్టిఫికెట్లు అందేలా సహాయం చేస్తున్నామని ఆయన తెలిపారు. క్రైస్తవులపై లేదా చర్చిలపై దాడులు జరిగితే పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా స్వాగతించి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంకా రాబోయే రెండు మూడు నెలల్లో జీఓ జారీ చేసి అర్హులైన పేద క్రైస్తవులకు వ్యాపారం ప్రారంభించేందుకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ప్రయాణ సౌకర్యం కోసం ఎలక్ట్రిక్ స్కూటర్లు, పాస్టర్లకు నెలసరి వేతనం అందించే అంశాలపై కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే రెండేళ్లలో క్రైస్తవుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద క్రైస్తవులను ఆర్థికంగా బలపరచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఐసీపీసీ అధ్యక్షులు రెవ.కె.దినాకర్ మాట్లాడుతూ.. క్రైస్తవ సమాజ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తున్న క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ చైర్మన్ దీపక్ జాన్ క్రైస్తవులకు ఒక దీపం, దిక్సూచి వంటివారని అభినందించారు. భవిష్యత్తులో ఆయన ఇంకా ఉన్నత పదవులు చేపట్టి పేద క్రైస్తవులకు మరిన్ని సేవలు అందించాలని దేవునికి ప్రార్థిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీపీసీ కార్యదర్శి రెవ.ఆర్.దేవకుమార్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశంలో ప్రోటోకాల్ రగడ

ఎమ్మెల్సీకి ప్రాధాన్యత లేకుండా చేసిన అధికార పార్టీ నాయకులు

ప్రతి పక్ష సభ్యులకు మైక్ ఇవ్వకపోవడంతో ఆగ్రహం

ప్రోటోకాల్ పాటించని కమిషనర్ తీరుపై ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అసంతృప్తి

మున్సిపల్ కౌన్సిలర్లను మొదటి సమావేశం సందర్భంగా బిఆర్ఎస్ కౌన్సిలర్ల ఆగ్రహం




షాద్నగర్ నియోజకవర్గం మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : షాద్ నగర్ మున్సిపల్ మొదటి సమావేశం ప్రోటోకాల్ రగడకు దారితీసింది. ప్రోటోకాల్ పాటించని మున్సిపల్ కమిషనర్ సునీత తీరుపై ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. షాద్ నగర్ పురపాలక సంఘం ఆర్థిక సంవత్సరం 2026-2027 బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా సభలో సభ్యులు తమ పట్ల జరుగుతున్న ప్రోటోకాల్ సమస్యను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డు సభ్యులు ప్రజల చేత ఎన్నుకోబడిన వారని తమ వార్డులో ఉన్న సమస్యల పట్ల పూర్తి అవగాహన సభ్యులకు మాత్రమే ఉంటుందని,వారి వార్డులో ఉన్న సమస్యలకు సంబంధించిన పనులు చేయడానికి ప్రపోజల్స్ ను ఇతరులతో తీసుకోవడం సభ్యులను అవమానించినట్లేనని ఇకమీదట ప్రతి వార్డులో జరిగే ఎటువంటి పనికైనా గౌరవ సభ్యుల నుండి మాత్రమే వర్క్ ప్రపోసల్ తీసుకోవాలని ప్రోటోకాల్ ఉల్లంఘన జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిషనర్ పైనే ఉందని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన గౌరవ సభ్యులకు వారి వార్డు సమస్యలను తెలియజేయడానికి సభలో మైకు ఇవ్వకపోవడం అభ్యంతరకరమని, రాబోయే సమావేశంలో గౌరవ సభ్యులు తమ సమస్యలను తెలియజేయడానికి వారికి మైక్ కేటాయించేలా చూడాలని సూచించారు.

### మైకు ఇవ్వకపోతే ఎందుకు..

ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు మైకు ఇవ్వకుండా సమావేశం అయిపోయిందని ఎమ్మెల్యే, చైర్మన్ సభను ముగించడం సభా సంప్రదాయం కాదని బిఆర్ఎస్ కౌన్సిలర్లు నందారం అశోక్ యాదవ్, ఎస్పీ శివ తదితరులు పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఓవైపు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని అవమానిస్తూ మరోవైపు తమ కూడా ప్రాధాన్యత లేకుండా చేశారని ఇలాంటి పరిస్థితులపై అధికారులు నిష్పక్షపాతంగా వివరించాల్సిన అవసరం ఉందని ఇకపై జరిగే కౌన్సిల్ సమావేశాల విషయంలో టిఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా ప్రశ్నించక తప్పదని పేర్కొన్నారు. బడ్జెట్ విషయంలో సభ్యుల సూచన సలహాలు లేకుండా ఏకపక్షంగా సిద్ధం చేయడం కూడా సరికాదని పేర్కొన్నారు. మాట్లాడటానికి ఎమ్మెల్సీకి మైక్ ఇవ్వకపోవడం చాలా దారుణమని ఇలా అవమానించడం సరికాదని ఇలా చేస్తే ఉన్నతాధికారులకు పూర్తిస్థాయిలో కౌన్సిలర్లు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. అదేవిదంగా నూతనంగా ఎన్నుకోబడిన మున్సిపల్ కౌన్సిలర్లను శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ లు,మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## శ్రీరక్ష ఆరోగ్య యాత్ర గ్రామాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమం



ఖమ్మం, మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : శ్రీరక్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో "శ్రీరక్ష ఆరోగ్య యాత్ర" కార్యక్రమం ఖమ్మం జిల్లా బోనకల్ మరియు ముష్టికుంట్ల గ్రామాలలో విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యాత్రలో భాగంగా గ్రామ ప్రజలకు మధుమేహం (డయాబెటిస్), రక్తపోటు (హైపర్‌టెన్షన్), కాలేయం (లివర్) మరియు మూత్రపిండాల (కిడ్నీ) వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. అలాగే ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు • RBS (Random Blood Sugar) •LFT (Liver Function Test) • RFT (Renal Function Test), వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సహకారాన్ని అందించారు. డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు (+ఎ) గారి నాయకత్వంలో, శ్రీరక్ష ఆసుపత్రి వైద్యులు మరియు సిబ్బంది గ్రామ వీధులలో పాదయాత్ర చేస్తూ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. యాత్రలో భాగంగా గ్రామాల్లో నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు.



యాత్రలో వినిపించిన ముఖ్యమైన ఆరోగ్య నినాదాలు:

'ఆరోగ్యమైన కుటుంబమే నిజమైన సంపద", "మద్యం కాకుండా నీరు ఎక్కువగా తాగండి", "మధుమేహం మరియు రక్తపోటు పరీక్షలు తరచుగా చేయించుకోండి", 'కాలేయం మరియు కిడ్నీలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత", "పరాక్వాట్ విషాన్ని నిషేధించాలి ప్రాణాలను కాపాడాలి", "పంటలపై వాడే పరాక్వాట్ విషం చివరికి మన భోజన పాత్రలోకి వస్తుంది జాగ్రత్త!", ఈ సందర్భంగా డాక్టర్ జి.వి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటే అనేక తీవ్రమైన వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. అలాగే పరాక్వాట్ వంటి ప్రమాదకరమైన విష రసాయనాల వల్ల కాలేయం, కిడ్నీలు మరియు ప్రాణాలకు తీవ్రమైన ప్రమాదం కలుగుతుందని, అందువల్ల ప్రభుత్వం దీనిపై తక్షణమే చర్యలు తీసుకుని పరాక్వాట్‌ను నిషేధించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రీరక్ష ఆసుపత్రి 100 గ్రామాల్లో ఇలాంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మరియు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్య రక్షణకు కృషి చేస్తుందని తెలిపారు. జారీ చేసిన వారు: శ్రీరక్ష ఆసుపత్రి నెహ్రూ నగర్, ఖమ్మం 70024 10024 / 9246947771.



## కందకుర్తి పుష్కర ఘాట్ ను సందర్శించిన ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్ ను ప్రభుత్వ సలహాదారు,బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి,కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.వచ్చే ఏడాది 2027లో జూన్ 26వ తేదీ నుంచి జులై 07వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్ ను క్షేత్రస్థాయిలో సందర్శించి,చేపట్టాల్సిన పనుల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.గోదావరి,మంజీర,హరిద్ర నదుల కలయికతో త్రివేణి సంగమంగా ప్రసిద్ధి గాంచిన కందకుర్తి ప్రాంతానికి పుష్కర స్నానాల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు.గత పుష్కరాలను బట్టి చూస్తే ఈసారి కూడా ప్రతి రోజు సగటున రెండు లక్షల మంది భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు.దీనిని దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎక్కడ కూడా అసౌకర్యాలు ఏర్పడకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా పక్కాగా పనులు జరిపించాలని అధికారులను ఆదేశించారు.వాహనాల పార్కింగ్,మరుగుదొడ్లు,తాత్కాలిక గదులు,భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి,షామియానాలు,దుస్తులు మార్చుకునే గదులు వంటివి అందుబాటులో ఉండాలన్నారు.వీఐపీ,వీవీఐపీల కోసం కొత్తగా మరో ఘాట్ నిర్మించాలని సూచించారు.అన్ని ఘాట్ల వద్ద భక్తులకు పూర్తి స్థాయిలో పటిష్ట భద్రత కలిగి ఉండేలా రేయిలింగ్,రక్షణ కంచె ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని అన్నారు.కాగా,పుష్కర ఘాట్ వద్ద అవసరమైన వాటికి పెయింటింగ్ చేయించి ఆకట్టుకునే రీతిలో పరిసరాలను ఆకర్షణీయంగా,అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.భక్తుల నుండి ఏ చిన్న ఫిర్యాదుకు సైతం ఆస్కారం లేకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండాలన్నారు.ప్రధాన మార్గం నుండి పుష్కర ఘాట్ల వరకు రోడ్డు వెడల్పు,మరమ్మతులు జరిపించాలని అన్నారు.అవసరమైన చోట కల్వర్టులు,వంతెనల నిర్మాణాలు కూడా జరిపించాలని సంబంధిత అధికారులకు సూచించారు.సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యానికి తావు లేకుండా చేపట్టాల్సిన ప్రతి పనిని గుర్తిస్తూ సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు.వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్,దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి,సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## ఘనంగా వెంకటేశ్వర స్వామి రథోత్సవం

యాచారం గ్రామ సర్పంచ్ అనిత శరణం ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకట్ రెడ్డి



ఇబ్రహీంపట్నం మార్చి 15 (జర్నలిస్ట్ ఫైల్) : యాచారం మండల పరిధిలోని శ్రీ తిరుమల గుట్టపైన పద్మావతి అలివేలుమంగ శ్రీ వెంకటేశ్వర రథోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జరిగే వెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని భక్తులు స్వామివారినీ రథం పైన ఉంచి గుట్టపైన రథాన్ని లాగడం దేవుడిని రథంపై ఉంచి రథోత్సవాన్ని పెద్ద ఎత్తున చేయడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున కదలి వచ్చి వెంకటేశ్వర రథోత్సవాన్ని తిలకించి, సంతోషంతో నచ్చిన దేవుడిని గోవిందా గోవిందా అనే నామస్మరణతో కేరింతలు కొడుతూ రథాన్ని ఉత్సాహంగా ఈ బ్రహ్మోత్సవాన్ని నడిపించారు. వెంకటేశ్వర స్వామి కోరిన కోరికల్ని భక్తులకు అనేక విధాలుగా అనేక పద్ధతుల్లో వారి యొక్క మనస్సులో ఉన్నటువంటి కోరికల్ని తీరుస్తారని ఆలయ కమిటీ చైర్మన్ యాచారం గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆయన కోరుకున్నారు. అదేవిధంగా ఈ జాతరలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు యువకులు వెంకటేశ్వర రథోత్సవాన్ని తిలకించి అనంతరం ఊర్లో ఉన్న దేవాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి ఉప్పల భాస్కర్, కేశ మోని బుచ్చయ్య గౌడ్ తదితర ఆలయ కమిటీ సభ్యులు ప్రధాని గుంజుతో దేవుడు యొక్క అనుభూతిని పొందారు.

## పారిశుద్ధ్య పై దృష్టి సారించాలి

కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : పారిశుద్ధ్య పై దృష్టి సారించాలి అని ఖమ్మం నగర పాలక సంస్థ కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం డివిజన్ కార్పొరేటర్ ఉదయం 5 గంటలకు పారిశుద్ధ్య కార్మికుల హాజరు పరిశీలించి , క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని, బాధ్యతగా వ్యవహరించాలని, డివిజన్ పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కన్నం ప్రసన్న కృష్ణ, డివిజన్ జవాన్, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తాళ్ళపాక అన్నమయ్య ఆరాధనోత్సవం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ఏకాదశి, శ్రవణా నక్షత్రం ప్రాధాన్యతా క్రమంలో జ్ఞానప్రదాత శ్రీ లక్ష్మీహయగ్రీవ స్వామికి, ప్రత్యేక పూజలు, శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రీతి పాత్రుడైన తొలి సంకీర్తనా చార్యులు శ్రీ తాళ్ళపాక అన్నమయ్య ఆరాధనోత్సవం,శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ నిర్వాహణలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలాజీరావు పేట, ప్రియాడీలక్స్ ఎదుటగల, కోట బదరీనాద్ గుప్త స్థల ప్రాంగణంలోని, నారాయణ అష్టాక్షరీ క్షేత్రములో ఆదివారం విశేషంగా శ్రీ హయగ్రీవ స్వామివారి అనుగ్రహం, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు లభించాలన్న సంకల్పంతొ ప్రత్యేక పుజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ హయగ్రీవుని ప్రసాదంగా విద్యార్థినీ, విద్యార్థులకు, పెన్నులు, నోట్ పుస్తకాలు,పరీక్షల సమయంలొ, విద్యార్థులకు ఉపయోగ పడే అట్టలు ఉచితంగా అందజేశారు. అనంతరం శ్రీ తాళ్ళపాక అన్నమయ్య, 523వ, ఆరాధనోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా, అన్నమాచార్య కీర్తన భక్తి ప్రచారం ద్వారా, విలువైన ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్న భక్తి ప్రచారకులు పొత్తూరి వెంకట ఆదిలక్ష్మీ, కొండపి వసుందర, సొల్లేటి శైలజ, కొండపి శ్రీనివాసరావులను సంస్థ తరపున సత్కరించారు. కార్యక్రమ ప్రాధాన్యతను ట్రస్ట్ వ్యవస్థాపకులు రొంపిచర్ల వెంకట కిరణ్ మీడియాకు వివరించారు. ఆధ్యాత్మిక సేవయే పరమవదిగా ఏర్పాటు చేసిన శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ద్వారా చేపట్టే కార్యక్రమాలకు భక్తులు, దాతల నుండి చక్కని ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. ట్రస్ట్ ఆశయం శ్రీ కల్యాణ వెంకటేశ్వరుని ఆలయ నిర్మాణమని, ఆదిశగా బలమైన ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. విద్యా ప్రదాత, జ్ఞానమూర్తి శ్రీ లక్ష్మీ హయగ్రీవుని అనుగ్రహ ప్రసాదంగా విద్యార్థులకు పెన్నులు పంపిణి చేయడంలొ, తోడ్పడిన కమిటీ సభ్యులకు, దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలొ ట్రస్టు విద్యా కమిటీ అధ్యక్షులు కోట బద్రీనాథ్ గుప్తా, సాంస్కృతిక విభాగం కమిటీ అధ్యక్షులు లక్కరాజు సాయి, సంకీర్తన బృందం అధ్యక్షులు మూర్తి అనురాధ, ట్రస్ట్ లీగల్ సలహాదారులు బి. ఎం. ఎస్. దుర్గాప్రసాద్, అంజనీకుమారి, ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు,గుడివాడ బాలకృష్ణ, రొంపిచర్ల సురేష్, కోట రవిశంకర్, వెచ్చా కిషోర్, గోలి సోమశేఖర్,సంకీర్తన సభ్యులు, విశేష సంఖ్యలో విద్యార్థులు ,భక్తులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఎమ్మెల్యే నారా లోకేష్ సేవ స్ఫూర్తితో మంగళగిరి మండలం నవులూరు గ్రామంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నవులూరు గ్రామం మక్కెవారి పేటలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో వేమూరి జార్జి (కోటయ్య) జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు భార్య వేమూరి ఆరోగ్యం, కుమారులు వేమూరి మైనర్ బాబు, వేమూరి రాజు, వేమూరి వెంకటస్వామి, కుమార్తె ఈపూరి అరుణ కుమారి కలిసి పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సందర్భంగా అవసరమైన స్టేషనరీ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ బ్రాహ్మం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్టేషనరీ ప్యాడ్లు, జ్యామెట్రీ బాక్సులు, స్కేలు, పెన్లు, పౌచ్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ. 10,000 నగదు ప్రోత్సాహకంగా అందజేస్తామని ప్రకటించారు.

వేమూరి మైనర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని పలువురు కొనియాడారు. విద్యా వ్యవస్థను ఆధునికీకరించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో మంత్రి లోకేష్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తులో పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా వారిలో ప్రతిభను పెంపొందించే కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, డిజిటల్ సౌకర్యాలను విస్తరించడం, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల సామర్థ్యాలను పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు.

విద్యార్థుల్లో చదువు పై ఆసక్తి పెరగడంతో పాటు రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని వారు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా మంత్రి నారా లోకేష్ చేపడుతున్న కార్యక్రమాలు విద్యా రంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మంగళగిరి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకటరావు, అచ్చి ప్రసన్న, కూచిపూడి రమేష్, వేమూరి చిన్నబాబు, బేతపూడి మల్లేశ్వరరావు, పాస్టర్లు సత్యప్రకాష్, సూరిబాబు, మర్రి ఏసుబాబు, తెల్లమేకల నాగేశ్వరరావు, పైల రవి, తోట శ్రీనుబాబు, కొల్లి వెంకటరావు, బత్తుల నాగరాజు, వెంకటేశ్వరరావు, రుద్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ వాహన్ షోరూమ్ ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** భారత్ వాహన్ సంస్థ ద్వారా మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ కు అనుణంగా నమ్మకమైన నాణ్యత గల ద్విచక్ర వాహనాలను తెనాలి ప్రాంతంలొ అందుబాటులోకి తేవడం శుభ పరిణామ మని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ భారత్ వాహన్ షోరుమ్ ను ప్రారంభించిన సందర్భంగా అన్నారు. స్థానిక గంగానమ్మపేట లక్ష్మీ డీలక్స్ వంతెన రోడ్ లొ, గుప్తా కళాశాల ఎదుట, నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ వాహన్ షోరూమ్ ను, ఆదివారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా షోరూమ్ లో ప్రత్యేక పుజలొ, పాల్గొన్నారు. నిర్వాహకుల ద్వారా సంస్థ ఆలోచనలు, ఆశయాలు తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మీడియాతొ మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్ తొ పాటు , తెలంగాణ రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న ప్రీ--ఓన్డ్ టూ వీలర్ సంస్థ భారత్ వాహన్, సంస్థ వార్షికోత్సవం సందర్భంగా తెనాలి పట్టణంలో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించుకోవడం శుభపరిణామం అన్నారు. మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన ప్రీ--ఓన్డ్ బైక్స్‌ను అందుబాటు ధరల్లో అందిస్తున్న భారత్ వాహన్ సంస్థ అభివృద్ధి చెందుతూ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్రస్తుతం భారత్ వాహన్ సంస్థ ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో 20కి పైగా బ్రాంచ్‌లతో కస్టమర్లకు విశ్వసనీయ సేవలను అందిస్తున్న క్రమంలొ. నాణ్యమైన బైక్స్, పారదర్శకమైన ధరలతొ, మెరుగైన కస్టమర్ సపోర్ట్‌తో వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించుకోవడం సంతోషదాయకం అన్నారు. ప్రస్తుతం ప్రత్యేక వార్షికోత్సవ ఆఫర్స్ కూడా అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు ప్రకటించారు. బ్రాంచ్ ప్రారంభంతో ఈ ప్రాంత ప్రజలకు ఉత్తమమైన ప్రీ--ఓన్డ్ బైక్స్, సరసమైన ధరలతొ, సంస్థ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈకార్యక్రమంలొ రావి చిన్ని, బొద్దులూరి వేణు, వీరవల్లి మురళి, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఇఫ్తార్ విందు ఏర్పాట్ల పరిశీలన

○ **ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చిన ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సోమవారం జరగనున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ పరిశీలించారు. ఆదివారం విజయవాడ ఇఫ్తార్ విందు ప్రాంగణానికి ఎమ్మెల్యే నసీర్ వెళ్లి స్థానిక అధికారులు, కూటమి నాయకులతో చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. స్థానిక ప్రాంగణంలో నమాజ్ కు వచ్చే ముస్లిం సోదరుల కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింల అభ్యున్నతి సాధ్యమైందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లోనూ ముస్లింలకు 6 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందని చెప్పారు. ఇమామ్ లు, మౌజన్ల గౌరవ వేతనం అందించామని తెలిపారు. గత ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా చూశారని, ప్రస్తుత ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుందని ఈ సందర్భంగా వెల్లడించారు.

## వైభవంగా అవధూత నారాయణరెడ్డి స్వామి ఆరాధన మహోత్సవములు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు నడయాడిన ప్రాంతం బ్రహ్మంగారిమఠం లో బ్రహ్మ సాగర్ సమీపమున వెలసిన శ్రీ అవధూత నారాయణరెడ్డి యోగేంద్ర స్వాములవారి 112 వ ఆరాధన మహోత్సవములు అంగరంగ వైభవంగా జరుపుతున్నట్లు దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు భక్తులకు ఆహ్వానం పలుకుతూ స్వాములవారి ఆరాధన మహోత్సవములు 15 వ తేదీ మరియు 16 వ తేదీ రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుపుతున్న సందర్భంలో రాష్ట్రం నలుమూలల ఉన్న స్వామి వారి భక్తులు అలాగే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి భక్తులు మరియు జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి అమ్మవారి భక్తులు ఈ మహోత్సవాలలో పాల్గొని శ్రీఅవధూత నారాయణరెడ్డి యోగేంద్ర స్వాములవారి ఆశీస్సులు పొందాలని వారు భక్తులను కోరారు. ఆదివారం ఉదయం 6 గంటలకు గణపతి పూజలు అభిషేకములతో జరిపి సాయంత్రం నాలుగు గంటలకు వివిధ కార్యక్రమంలో పాటి సాంస్కృతిక కార్యక్రమాలు కోలాటాలు భజన బృందములు వారిచే గొప్ప భజన కార్యక్రమం కలవు. ఈ కార్యక్రమంలో బొమ్మ శివ నారాయణ రెడ్డి అలాగే ట్రస్ట్ సభ్యులు బొమ్ము ప్రతాప సింహారెడ్డి , బొమ్ము కృష్ణారెడ్డి, శ్రీ బొమ్ము విజయభాస్కర్ రెడ్డి, బొమ్ము ఉపేంద్రనాథరెడ్డి, బొమ్ము రామ మోహన్ రెడ్డి, మరియు బొమ్ము గోపాల్ రెడ్డి, శ్రీయపు బలరామిరెడ్డి, అయ్యప్ప రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# బడుగు బలహీనుల కోసం జనసేన



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** పేద బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటుందని జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయ కర్త కొర్రపాటి నాగేశ్వర రావు తెలిపారు. జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకుమాను లో మండలం జనసేన పార్టీ కార్యాలయం నందు మండలం నాయకులు పుప్పాల పూర్ణ, రెడ్డి నాగరాజు ఆ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా అతిదులు మాట్లాడుతూ అధినాయకుని ఆదేశాల మేరకు ఈ 13 ఆవిర్భావ దినోత్సవం పల్లె, పట్టణం ఊరు, వాడ, నేరుగా ప్రజలతోనే జరుపుకోవాలని సంకల్పంతో ప్రత్తిపాడు నియోజకవర్గం లోని కాకుమాను మండలంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జండా వందనం కార్యక్రమానికి జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొరపాటి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జండా వందనం చేసి పార్టీ నాయకులను కార్యకర్తలను జనసైనికులను వీర మహిళలను ఉత్తేజపరుస్తూ జనసేన పార్టీ మూల సిద్ధాంతాల గురించి వివరించారు. అధినాయకుడు పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం గా ,రాష్ట్ర మంత్రిగా ఎంతో నిబద్ధతతో నిజాయితీతో రాష్ట్రం బాగుపడాలని ఏకైక ఉద్దేశంతో రాష్ట్రం మేలు కొరకు నిరంతరం కష్టపడి పని చేస్తున్నరన్నారు. అలాంటి వ్యక్తి స్థాపించిన జనసేన పార్టీలో భాగస్వామ్యులమైనందుకు ప్రతి ఒక్కరు గర్విస్తూ భవిష్యత్తులో ఆయనను ఆదర్శంగా తీసుకొని క్రియాశీల రాజకీయాల్లో సామాన్యులు బడుగు బలహీనులకు ఆసరాగా నిలబడుతూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జనసేన కూటమి నాయకులు దేగల లక్ష్మణ్,పుప్పాల పూర్ణ, రెడ్డి నాగరాజు, సునీల్, మల్లిఖార్జున రావు, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ అక్షర ఆంధ్రా పరీక్షలను తనిఖీ చేసిన కలెక్టర్



○ **పరీక్షలకు 90,426 మంది నమోదు**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఉల్లాస్ అక్షర ఆంధ్రా పరీక్షలను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదివారం తనిఖీ చేశారు. గుంటూరు పట్టణం కె.వి. పి కాలనీ దగ్గరలో గల లాల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో జరుగుతున్న పరీక్షలను తనిఖీ చేశారు. కేంద్రంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎండ వేడిమి కారణంగా అన్ని కేంద్రాల్లో తాగునీటి సదుపాయం ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు వచ్చి పరీక్షలు రాయుటకు అనుగుణంగా తగు సూచనలు సలహాలు అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ పరీక్షలకు జిల్లాలో 90,426 మంది అభ్యర్థులు నమోదు అయ్యారు. జిల్లాలో 1485 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు తమకు అవకాశం ఉన్న సమయంలో వచ్చి పరీక్షలు రాసుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించింది. పరీక్షను రెండు గంటల పాటు నిర్వహించడం జరుగుతుంది. ఈ పరీక్షలు 150 మార్కులకు ఉంటుంది, అందులో 50 మార్కులు చదవడానికి, 50 మార్కులు రాయడానికి, 50 మార్కులు అంకెల పరిజ్ఞానంపై ఉంటుంది. ఒక్కో విభాగంలో 17 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణత పొందినట్లు భావిస్తారు.

**శత శాతం అక్షరాస్యత ధ్యేయం**

జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో శత శాతం అక్షరాస్యత సాధించడం ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహిళలు అక్షరాస్యులు కావాలని తద్వారా కుటుంబాల్లో అక్షరాస్యత శాతం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా డిప్యూటీ డైరక్టర్ ఆంజనేయులును, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుండి పది పరీక్షలు



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):** నేటి నుండి పది పరీక్షలు జరగనున్నట్లు కాకుమాను మండలం విద్యా శాఖ అధికారి కేనెడి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకుమాను మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. కాకుమాను జడ్పీ హై స్కూల్ నందు 220 మంది విద్యార్థులు,చినలింగాయపాలెం జడ్పీ హై స్కూల్ నందు 60 మంది విద్యార్థులకు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు.

**పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు**

కాకుమాను మండలం పరిధిలో జరగనున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు కాకుమాను ఎస్ ఐ హరి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతు

ఎస్.ఎస్.సీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు) శాంతియుతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఉన్నతధికారుల ఆదేశాల మేరకు కాకుమాను మండలంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు.

పరీక్ష పూర్తయ్యే వరకు విద్యార్థులను బయటకు పంపడం జరగదన్నారు.

హాల్ టికెట్ లేనిదే లోపలికి అనుమతి లేదన్నారు .మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్ పరికరాలు మరియు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను పరీక్షా కేంద్రంలోకి తీసుకురావడం పూర్తిగా నిషిద్ధమని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు . కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుమికూడరాదని అన్నారు .

ఎస్ఎస్సి అన్ని పరీక్షల సమయంలో, అన్ని పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ మరియు ఇంటర్నెట్ షాపులను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## పశు వ్యాధి నియంత్రణ టీకాలు వేయించండి : చీఫ్ విప్ జీవి



**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్ ):** పశువులకు గాలికుంటు వ్యాధులు సోకకుండా నివారణ టీకాలు వేయించాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు పశుపోషకులకు సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువులకు గాలికుంటు నివారణ టీకా కార్యక్రమం గోడ ప్రతులను ఆదివారం తన నివాసంలో చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వ్యాధి నియంత్రణలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా నివారణ టీకాలు వేయించడం జరుగుతుందని, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినుకొండ పశు వైద్య శాల పరిధిలో 52,070 తెల్ల, నల్ల పశువులు ఉన్నాయని పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. శ్రీరాములు వివరించగా ప్రతి పశువుకి గాలికుంటు నియంత్రణ టీకాలు వేయించాలని సూచించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నైతిక ప్రమాణాలు పాటించడం పరిశోధకుల బాధ్యత

○ **న్యూఢిల్లీలోని సీసీఎస్ఈఏ సీనియర్ కన్సల్టంట్ డాక్టర్ వివేక్ త్యాగి**

○ **విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా ముగిసిన జాతీయస్థాయి ఫార్మసీ కాన్ఫరెన్స్**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** పరిశోధనల్లో జంతువుల వినియోగం విషయంలో ఎథికల్ గైడ్‌లైన్స్‌ను కచ్చితంగా పాటించడం అత్యంత అవసరమని, శాస్త్రీయ పరిశోధనలు మానవాళి అభివృద్ధికి ఎంతో ముఖ్యమైనవే అయినప్పటికీ వాటి నిర్వహణలో నైతిక ప్రమాణాలు పాటించడం పరిశోధకుల బాధ్యత అని న్యూఢిల్లీలోని సీసీఎస్ఈఏ సీనియర్ కన్సల్టంట్ డాక్టర్ వివేక్ త్యాగి పేర్కొన్నారు.

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో సీసీఎస్ఈఏ (కమిటీ ఫర్ కంట్రోల్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ ఎక్సిపెరిమెంట్స్ ఆన్ అనిమల్స్) ఆర్థిక సౌజన్యంతో "రీడిఫైనింగ్ ఎక్సిపెరిమెంటల్ ఫార్మాకాలజీ" అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి కాన్ఫరెన్స్ శనివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని "ఎథికల్, ఆల్టర్‌నేటివ్ అండ్ డిజిటల్ ఫ్రాంటియర్స్" అనే ఇతివృత్తంతో నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యూఢిల్లీలోని సీసీఎస్ఈఏ సీనియర్ కన్సల్టంట్ డాక్టర్ వివేక్ త్యాగి మాట్లాడుతూ పరిశోధనల కోసం ప్రయోగ జంతువులను ఉపయోగించే సందర్భంలో జంతు సంక్షేమాన్ని కాపాడడం, అవసరమైన అనుమతులు పొందడం, ప్రయోగాలను బాధ లేని విధంగా నిర్వహించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ నేపథ్యంలో సీసీఎస్ఈఏ రూపొందించిన నైతిక మార్గదర్శకాలను ప్రతి పరిశోధకుడు తప్పనిసరిగా అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.

అలాగే ప్రయోగాల సంఖ్యను తగ్గించడం, జంతువులకు కలిగే నొప్పి మరియు ఇబ్బందులను తగ్గించే విధానాలను అనుసరించడం, అవసరమైనప్పుడు ఆల్టర్‌నేటివ్ పద్ధతులు మరియు డిజిటల్ సాంకేతికతలను వినియోగించడం వంటి అంశాలు ఆధునిక ఫార్మకాలజీ పరిశోధనల్లో కీలకంగా మారుతున్నాయని తెలిపారు.

పరిశోధనల్లో 3ఆర్ సూత్రాలు (రీప్లేస్‌మెంట్, రిడక్షన్, రిఫైన్‌మెంట్) అనుసరించడం ద్వారా జంతు ప్రయోగాలను నైతికంగా మరియు బాధ్యతాయుతంగా నిర్వహించవచ్చని చెప్పారు. పరిశోధకులు, విద్యార్థులు ఈ మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని బాధ్యతతో వ్యవహరించాలన్నారు. శాస్త్రీయ పరిశోధనలు నైతిక విలువలను పాటిస్తూ కొనసాగినప్పుడే సమాజానికి ఉపయోగపడే నూతన ఔషధాలు మరియు వైద్య సాంకేతికతలు అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు.

కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్. హరీష్ శంకర్ మాట్లాడుతూ వైద్యశాస్త్రం, ఫార్మకాలజీ ,జీవశాస్త్ర పరిశోధనల్లో జంతు నమూనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మానవ శరీరంలో జరిగే వ్యాధుల లక్షణాలు, ఔషధాల ప్రభావం, కొత్త చికిత్సా విధానాల సమర్థతను అధ్యయనం చేయడానికి జంతు నమూనాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. కొత్త ఔషధాలను అభివృద్ధి చేసే ప్రక్రియలో ముందుగా జంతువులపై ప్రయోగాలు నిర్వహించడం ద్వారా వాటి భద్రత, ప్రభావం మరియు దుష్ప్రభావాలను అంచనా వేయవచ్చని పేర్కొన్నారు. ఈ పరిశోధనల ద్వారా ఔషధాల ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి, తరువాత మానవులపై క్లినికల్ ట్రయల్స్‌కు దారి తీస్తారని తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్. రామకృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పోషకాహార లోపాలు వంటి అనేక రోగాలపై పరిశోధనలు చేయడంలో జంతు నమూనాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఈ ప్రయోగాలు నిర్వహించే సమయంలో నైతిక ప్రమాణాలు పాటించడం, జంతు సంక్షేమాన్ని కాపాడడం చాలా ముఖ్యమని సూచించారు. జంతు నమూనాలపై పరిశోధనలు శాస్త్రీయ అభివృద్ధికి దోహదపడటమే కాకుండా కొత్త ఔషధాల అభివృద్ధి, వ్యాధుల నివారణ మరియు చికిత్సా విధానాల మెరుగుదలకు కూడా ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. పరిశోధకులు మరియు విద్యార్థులు ఈ రంగంలో మరింత పరిశోధనలు చేపట్టి వైద్యరంగ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌లో భాగంగా 20కళాశాలల నుంచి వచ్చిన 350 కు పైగా విద్యార్థులకు నిర్వహించిన ఓరల్ మరియు పోస్టర్ ప్రెజెంటేషన్‌లలో సత్తా చాటిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సీసీఎంబీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ జే. మహేష్ కుమార్, సీఎస్ఐఆర్-ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కే. సురేష్ బాబు, బెంగళూరులోని దయానంద్ సాగర్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. విజయ్ కుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## బూత్ కమిటీలే బీజేపీ బలానికి పునాది




**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి రూరల్ మండలంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కడియాల నాదకేశ్వర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
కార్యక్రమంలో నిర్వహించిన ఆరో కాలాంశం "కార్య విస్తరణ మరియు బూత్ మేనేజ్మెంట్" పై భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గ్రామ స్థాయి నుంచి బలపడాలంటే కార్య విస్తరణతో పాటు బూత్ మేనేజ్మెంట్ కీలకమని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజలతో సన్నిహితంగా ఉంటూ పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.
ఎన్నికల విజయానికి బూత్ కమిటీలు బలంగా ఉండటం అత్యంత అవసరమని, ప్రతి బూత్‌లో చురుకైన కార్యకర్తలు పని చేస్తే పార్టీ విజయానికి అది బలమైన పునాది అవుతుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ విస్తరణలో వివిధ మోర్చాల పాత్ర కూడా ఎంతో కీలకమని తెలిపారు.
అలాగే ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కార్యకర్త తమ బూత్ పరిధిలో 18 సంవత్సరాలు పూర్తి చేసిన కొత్త ఓటర్లను నమోదు చేయడం, ఓటరు వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమానికి దేవరకొండ రవి అధ్యక్షత వహించగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ట్రస్టు అవార్డుతో డా. రమణ యశస్వికి ఘన సత్కారం




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** వైద్య సేవలను కేవలం వృత్తిగా కాకుండా సమాజానికి సేవగా భావిస్తూ పేదలకు అండగా నిలుస్తూ, థలసేమియా బాధితులకు నిరంతరం సహాయం అందిస్తూ, ఉచిత వైద్య శిబిరాల ద్వారా వేలాది మందికి ఆరోగ్య సేవలు అందిస్తున్న గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రమణ యశస్వి సేవలకు గుర్తింపుగా ఎన్టీఆర్ ట్రస్టు ప్రతిష్ఠాత్మక అవార్డు ప్రదానం చేసింది.
థలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఎన్నో సంవత్సరాలుగా పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేయడం వంటి సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ట్రస్టు మేనేజర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.
హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దాతలు, వైద్యులు మరియు సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు.
ఈ సందర్భంగా గుంటూరు జిల్లాకు చెందిన వైద్యులలో డా. రమణ యశస్విని మాత్రమే ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ట్రస్టు వర్గాలు వెల్లడించాయి. వైద్య వృత్తిని సేవగా భావిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తున్న డా. రమణ యశస్వి సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు వైద్యులు అభినందించారు.

## ఉర్దూ భాష ద్వారా విస్తృత విద్యా-ఉపాధి అవకాశాలు : షేక్ నాగూర్ వలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** భారత రాజ్యాంగం గుర్తించిన ప్రధాన భారతీయ భాషల్లో ఉర్దూ భాషకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, ఈ భాష ద్వారా విద్యను అభ్యసించిన వారికి విస్తృతమైన విద్యా మరియు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఉర్దూ భాష పరిశోధకులు షేక్ నాగూర్ వలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న అనేక విద్యాసంస్థల్లో ఉర్దూ భాషలో విద్యాభ్యాసానికి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తించి, భాష అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నదన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉర్దూ అకాడమిని ఏర్పాటు చేసి ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఉర్దూ భాషను అభ్యసించే విధంగా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయి మొదటి తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ స్థాయి వరకు ఉర్దూ భాషలో విద్యను అభ్యసించే అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా ఉర్దూ చదివిన వారికి టీచర్ ట్రైనింగ్ ద్వారా ఉర్దూ టీచర్‌గా ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అలాగే డిగ్రీలో ఉర్దూ చదివిన వారు బీఈడ్ పూర్తి చేసి స్కూల్ అసిస్టెంట్ లేదా ఉర్దూ పండిట్‌గా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా సేవలందించవచ్చన్నారు. ఇంటర్మీడియట్‌లో బైపీసీ గ్రూప్‌లో ఉర్దూ చదివిన విద్యార్థులు జాతీయ స్థాయి నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే బీయూఎంఎస్ (యునాని వైద్య కోర్సు)లో చేరి యునాని వైద్యులుగా ఎదగవచ్చని చెప్పారు. అంతేకాకుండా ఉర్దూ భాషలో ప్రావీణ్యం కలిగిన వారికి ఉర్దూ ట్రాన్స్‌లేటర్, ఉర్దూ డీటీపీ ఆపరేటర్, ఉర్దూ న్యూస్ ఎడిటర్, ఉర్దూ న్యూస్ రీడర్‌గా పత్రికలు మరియు టీవీ ఛానళ్లలో కూడా ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. డిగ్రీ తరువాత ఎంఏ ఉర్దూ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, ఉర్దూ ప్రొఫెసర్‌లుగా కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అందువల్ల విద్యార్థులు ఉర్దూ భాష ద్వారా అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందాలని ఆయన సూచించారు.

## మానసిక ప్రశాంతతతో అత్యుత్తమ ఫలితాలు సాధించండి

○ బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులకు మంత్రి సవిత పిలుపు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత శుభాకాంక్షలు తెలియజేశారు. ఎటువంటి ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి కావొద్దని, మానసిక ప్రశాంతతతో పరీక్షలు రాసి, అత్యుత్తమ ఫలితాలు రాబట్టాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో నేటి నుంచి ప్రారంభం కాబోయే పదో పరీక్షలకు 13,604 మంది బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. వారిలో బీసీ హాస్టళ్ల విద్యార్థులు 8,068 మంది, ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 5,536 మంది ఉన్నారన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు రాబట్టడానికి బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, మెటీరియల్స్ అందజేశామన్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విద్యార్థి దశలో పదో తరగతి ఎంతో కీలకమన్నారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేరుస్తూ, ఉపాధ్యాయుల దిశానిర్దేశంలో అత్యుత్తమ మార్కుల సాధించాలన్నారు. పరీక్షలకు మానసిక ప్రశాంతతతో హాజరుకావాలని, ఎటువంటి ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి కావొద్దని విద్యార్థులకు మంత్రి సూచించారు. టెన్త్ విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. పరీక్షా కేంద్రాలకు హాల్ టికెట్లతో ముందుగానే చేరుకోవాలన్నారు. బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో మౌలిక సదుపాయలు, పౌష్టికాహారంతో కూడిన మెనూ అందిస్తోందన్నారు. విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. గతేడాది ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ ఏడాది కూడా ఎంజేపీ విద్యార్థులతో పాటు బీసీ హాస్టళ్ల విద్యార్థులు కూడా టెన్త్ పరీక్షల్లో వంద శాతం మేర ఉత్తీర్ణతా శాతం సాధించి, కూటమి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని మంత్రి ఆకాంక్షించారు. డీబీసీడబ్ల్యూవోలు, ఇతర సిబ్బంది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వెంటే ఉండాలని, పరీక్షలు అవ్వగానే వారిని తిరిగి హాస్టళ్లకు, ఎంజేపీ స్కూళ్లకు క్షేమంగా తీసుకురావాలని మంత్రి సవిత ఆదేశించారు.

## మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు



**రాయచోటి (జర్నలిస్ట్ ఫైల్) :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కడప జిల్లా రాయచోటి పట్టణంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫారూక్ పాల్గొన్నారు. కడప జిల్లా సీనియర్ మైనారిటీ నాయకుడు అమీర్ బాబు కూడా హాజరై కార్యక్రమాన్ని విశిష్టంగా నిలిపారు.
ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేయడం ఆనందంగా ఉందన్నారు. రాయచోటి నియోజకవర్గం నుంచి వేలాది మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. మత సామరస్యాన్ని, సోదరభావాన్ని బలపర్చే కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని చెప్పారు.
రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. మైనారిటీ విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముస్లిం మైనారిటీల కోసం షాది ఖానాల నిర్మాణం, స్మశాన వాటికలకు ప్రహరీ గోడలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.
సామరస్యంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, హిందూ--ముస్లింలు ఐక్యంగా ముందుకు సాగితేనే ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ ఇఫ్తార్ విందులో హిందూ, ముస్లిం సోదరులు కలిసి పాల్గొనడం సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫారుక్ మాట్లాడుతూ రాయచోటి ప్రాంత ప్రజలతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. గతంలో ఈ ప్రాంత ప్రజల ప్రేమాభిమానాలను పొందిన సందర్భాలను గుర్తు చేశారు. అలాగే ఎన్.టీ.రామారావు పాలనలో రాయచోటి అభివృద్ధి దిశగా పలు కీలక కార్యక్రమాలు అమలైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, మత పెద్దలు, యువత, అభిమానులు, పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## మంచి ప్రభుత్వాలను ఎన్నుకున్నారు... పేదలందరికీ మేలు జరుగుతుంది



**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజలు కేంద్ర రాష్ట్రాల్లో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని హనుమాన్ నగర్ 14వ లైన్‌లో బిజెపి నాయకుడు మేడం రమేష్ ఆధ్వర్యంలో పీఎం ఉజ్వల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు నిర్వహించిన ఉచిత గ్యాస్ కనెక్షన్లు, సిలిండర్లను కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు.
ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పేద మహిళల కష్టాలను తగ్గించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఉజ్వల పథకం ఎంతో మందికి మేలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, దీంతో పేదలందరికీ మేలు జరుగుతుందని అన్నారు.
గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని ఆయన విమర్శించారు. సహజ వనరులను కూడా దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ పేదల జీవితాల్లో మార్పులు తీసుకువస్తోందన్నారు. గ్యాస్ సిలిండర్లు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి, చీఫ్ విప్ జీవి ఆంజనేయులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేరళంలో బీజేపీకి పెరుగుతున్న ప్రజా మద్దతు

○ ఉడుంబంచోలా నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కిలారు దిలీప్




**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** కేరళంలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని, అదే సమయంలో భారతీయ జనతా పార్టీ పట్ల ఆదరణ రోజురోజుకూ పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ మీడియా ఇన్‌చార్జి, ఉడుంబంచోలా అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కిలారు దిలీప్ తెలిపారు. రానున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి అధికారం కట్టబెట్టడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.
త్వరలో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉడుంబంచోలా నియోజకవర్గానికి బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన దిలీప్ ఆదివారం ఎరట్టయ్యార్ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, పంచాయతీ కమిటీ కార్యకర్తలతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా కార్యకర్తలు రాష్ట్రంలో కొన్ని కీలక అంశాలపై తమ ఆందోళనలను వ్యక్తం చేసినట్లు దిలీప్ తెలిపారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు సంబంధించిన ఎస్ఎన్‌సీ-లావలిన్ కేసు చాలా కాలంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉండటం ప్రజల్లో చర్చకు దారి తీస్తోందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారని చెప్పారు. ప్రజలు న్యాయవ్యవస్థపై గౌరవం కలిగి ఉన్నప్పటికీ, ప్రజా ప్రాధాన్యం ఉన్న కేసులు త్వరగా పరిష్కారం కావాలని ఆశిస్తున్నారని అన్నారు.
అలాగే అధికారంలో ఉన్న నాయకులకు సంబంధించిన కేసులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండటం సమాజంలో తప్పు సందేశాన్ని కలిగించే ప్రమాదం ఉందని కార్యకర్తలు పేర్కొన్నారని దిలీప్ వెల్లడించారు. న్యాయం ఆలస్యం అయితే ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటుందని వారు అభిప్రాయపడ్డారని తెలిపారు.
ఇటీవల కేరళలో వెలుగులోకి వచ్చిన గోల్డ్ స్మగ్లింగ్ కేసు వంటి వివాదాలు కూడా ప్రజల్లో పాలనపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయని సమావేశంలో కార్యకర్తలు అభిప్రాయపడ్డారని ఆయన చెప్పారు. స్వప్న సురేష్, ఎం. శివశంకర్ వంటి వ్యక్తుల పేర్లు దర్యాప్తుల్లో వినిపించడం ప్రజల్లో చర్చకు దారి తీసిందన్నారు.
ఏప్రిల్ 9న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కేరళ ప్రజలకు కీలకమైనవని, శుభ్రమైన రాజకీయాలు, బాధ్యతాయుత పాలన, పారదర్శకతకు ప్రజలు ప్రాధాన్యం ఇస్తారని కిలారు దిలీప్ తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఈ ఎన్నికల ద్వారా లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ఒత్తిళ్లకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

○ పదోతరగతి విద్యార్థులకు మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుండి ప్రారంభమవుతున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక, మార్కెటింగ్, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు. బంగారు భవిష్యత్తును నిర్మించుకునే దిశగా ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థులు మరో కీలక అడుగు వేస్తున్న ఈ సమయంలో లక్ష్యంపైనే దృష్టి పెట్టి శ్రమించాలని మంత్రి సూచించారు. కష్టపడి చదివిన ప్రతిఫలం తప్పక లభిస్తుందని, ధైర్యంగా పరీక్షలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సదుపాయం కల్పించడం, అవసరమైన చోట వైద్య బృందాలను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి కోరారు.

## పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నేటి నుంచి పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులందరికీ ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన విద్యార్థులకు ధైర్యం, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోవాలని సూచించారు. పరీక్షల సమయంలో ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. ఏడాది పొడవునా కష్టపడి చదివిన చదువు, సాధించిన జ్ఞానం ఈ పరీక్షల ద్వారా మీ ప్రతిభను, ఆత్మవిశ్వాసాన్ని నిరూపించుకునే మంచి అవకాశమని పేర్కొన్నారు.
పరీక్షల సమయంలో సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని ప్రశ్నలను జాగ్రత్తగా చదివి సమాధానాలు రాయాలని సూచించారు. పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలను సమర్థవంతంగా రాస్తే మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు. పరీక్షల్లో విద్యార్థులందరూ ఘనవిజయం సాధించి తమ తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ జీవితంలో విజయపథంలో ముందుకు సాగాలని పీవీఎన్ మాధవ్ అభిలషించారు.

## నేడు పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లు

○ మీకోసం వెబ్ సైట్ లో అర్జీలు సమర్పించవచ్చు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో మాత్రమే కాకుండా "మీకోసం" వెబ్ సైట్ లోను ఆన్ లైన్ లో ప్రజలు అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ తో పాటు నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లను ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. రెవిన్యూ క్లినిక్ లలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, గుంటూరు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారులు గ్రామ స్థాయి రికార్డులతో హాజరు అవుతారని తెలిపారు. మండలాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించి నమోదు చేయడంతో పాటు, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అప్పటికప్పుడే పరిష్కారం చేయలేని సమస్యలను వారం రోజులలో పరిష్కారం చేయుటకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను డివిజనల్, మండల రెవిన్యూ అధికారులు సమర్పిస్తామని వివరించారు. రెవెన్యూ క్లినిక్ కు నాలుగు కౌంటర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు.

**మీకోసం వెబ్ సైట్ లో అర్జీలు సమర్పించవచ్చు**

ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్ సైట్ లోను అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. అర్జీల వివరాలు (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీలను మీకోసం వెబ్ సైట్ లోను సమర్పించవచ్చని చెప్పారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం

○ బీజేపీ ఎస్సీ మోర్చా 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో బీజేపీ నేతలు








**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** పారిశుద్ధ్య కార్మికుల సేవలు సమాజానికి ఎంతో ముఖ్యమని, అందరూ సుఖంగా జీవించడానికి వారి కృషి ప్రధాన కారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.
కార్యక్రమానికి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, మాజీ మంత్రి, సినీ హాస్య నటుడు బాబూ మోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులలోనూ ప్రజాప్రతినిధులు, మంత్రులు ఎదగాలని పిలుపునిచ్చారు. మహిళా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. భారతీయ సంస్కృతిలో మహిళకు ఉన్న గౌరవాన్ని గుర్తుచేస్తూ భూమిని 'భారత మాత'గా, నదులను అమ్మవారి పేర్లతో పిలుస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పారిశుధ్య కార్మికులకు సముచిత గౌరవం లభించిందని పేర్కొన్నారు.
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను గౌరవిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా వారిని సన్మానించారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా పనిచేసిన పారిశుధ్య, ఆరోగ్య కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కలిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.
ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి చేస్తున్న సేవలు అపారమని తెలిపారు. వారి కష్టాన్ని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. స్వచ్ఛతను పరిరక్షించే ఈ కార్మికులు నగరాల ఆరోగ్యానికి, ప్రజల సౌకర్యానికి ప్రధాన బలంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, బీజేపీ కూడా వారికి మరింత గౌరవం మరియు అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు.
మాజీ మంత్రి, సినీ హాస్య నటుడు బాబూ మోహన్ మాట్లాడుతూ తన ప్రసంగంతో పారిశుధ్య మహిళా కార్మికులను అలరించారు. ప్రధాని మోదీ పారిశుధ్య కార్మికుల సేవలను గౌరవిస్తూ వారి కాళ్లు కడిగి సత్కరించిన మహానేత అని కొనియాడారు. త్వరలో తన పెద్ద కుమారుడి పేరుతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఎస్సీ మోర్చా నాయకులు గంగాధర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467